E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

తేదీ (24-04-2025) వారం (గురువారం) హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



రేపటి నుంచి పాఠశాలలకు సమ్మర్ హాలీడేస్ 3లో

# మోడీ కీలక నిర్ణయం..!!

## పాకిస్తాన్ ఖేల్ ఖతం

### 48 గంటల్లో పాక్ పౌరులు ఇండియా వదిలి వెళ్లాల్సిందే

- సింధు జలాల ఒప్పందంపై కత్తిరింపు నిర్ణయం
- పాక్ పౌరులకు భారతదేశంలో నిషేధం
- ఉగ్రదాడిపై స్పందన, భద్రతా చర్యలపై సమగ్ర చర్చ
- దౌత్య సంబంధాలపై కత్తెర.. హైకమిషన్ల సిబ్బంది తగ్గింపు
- దిల్లీలో ప్రధాని నివాసంలో భద్రతా కమిటీ అత్యవసర భేటీ
- రాజ్‌నాథ్ సింగ్ స్పందన: భారత్‌పై కుట్ర పన్నేవారిని వదిలిపెట్టం
- ఆర్థిక మంత్రి నిర్మలా పర్యటన రద్దు – తక్షణంగా స్వదేశానికి రాక
- అజిత్ ధోబాల్, జై శంకర్, టాప్ అధికారులు హాజరు



తరువాయి 2లో



## ఉగ్రదాడికి త్వరలో గట్టిబదులిస్తాం: రాజ్‌నాథ్ సింగ్

పహల్గాం ఉగ్రదాడిని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిరికిపంద చర్యగా అభివర్ణించారు.

తరువాయి 2లో

## పహల్గాం ఉగ్రదాడి.. అధికారికంగా 26 మంది మృతుల వివరాలు విడుదల



ఈ కబురు,న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాంలోని బైసారన్ ప్రాంతంలో

తరువాయి 2లో

## ముగ్గురు ఉగ్రవాదుల ఊహాచిత్రాలు విడుదల..!







తరువాయి 2లో

## హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ జపాన్ పర్యటనలో పలు కంపెనీలతో కీలక ఒప్పందాలు



**ఈ కబురు, హైదరాబాద్:**

జపాన్ పర్యటన ముగించుకొని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో సీఎం రేవంత్ కు ఎంపీలు.. ఎమ్మెల్యేలు.. సలహాదారులు.. కార్పొరేషన్ చైర్మన్ లు.. ఇతర కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఏప్రిల్ 16 న సీఎం నేతృత్వంలో అధికారులు బృందం ప జపాన్ పర్యటనకు వెళ్లింది. ఏడు రోజుల పాటు జపాన్ లో పర్యటించిన అధికారుల వివిధ పరిశ్రమల యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపి తెలంగాణలో రూ. 12వేల 62 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

తరువాయి 2లో



## ముగిసిన హైదరాబాద్ ఎమ్మెల్సీ పోలింగ్.. కాంగ్రెస్ ఓట్లు ఎటువైపు?

ఈ కబురు: : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇవాళ ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మొత్తం 112 ఓట్లకు గాను 88 ఓట్లు పోలయ్యాయి. 81 మంది కార్పొరేటర్లలో 66 మంది కార్పొరేటర్లు, 31 మంది అఫిషియో సభ్యులలో 21 మంది ఓటు వేశారు. ఓటింగ్ లో బీఆర్ఎస్ మినహా బీజేపీ , ఎంఐఎం , కాంగ్రెస్ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎంఐఎం తరఫున మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, బీజేపీ అభ్యర్థిగా గౌతమ్ రావు బరిలో నిలిచారు. ఈ నెల 25న ఓట్ల లెక్కింపు చేపడతారు. అయితే బీఆర్ఎస్ పోలింగ్ గు దూరంగా ఉండటం, కాంగ్రెస్ కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు ఓటింగ్ లో పాల్గొనడంతో ఫలితంపై ఉత్కంఠ నెలకొంది.

తరువాయి 2లో

## ఉగ్రదాడి ఎఫెక్ట్... రాష్ట్రాన్ని వీడుతున్న వేలమంది టూరిస్టులు

3లో





## పీసీసీ అబ్జర్వర్ల నియమకం.. పరిశీలకులుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

3లో

## తెలంగాణ ప్రజల గుండె ధైర్యం భారాస రజతోత్సవ సభాస్థలి పరిశీలనలో కేటీఆర్



ఈ కబురు, హైదరాబాద్: భారాస రజతోత్సవ సభ ప్రజల్ని రెచ్చగొట్టడానికో, ప్రభుత్వ వ్యతిరేకతను పెంచడానికి కాదని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. 25 వసంతాలు పూర్తి చేసుకున్నందున జరుపుకొనే వేడుక మాత్రమేనని తెలిపారు. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో పర్యటించిన ఆయన.. భారాస రజతోత్సవ సభాస్థలి వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఉద్యమ పార్టీగా ప్రతిపక్షంగా, ప్రభుత్వంలో ఎక్కడ ఉన్నా తెలంగాణ కీర్తిని హిమాలయాల స్థాయికి తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌దేనన్నారు.

తరువాయి 2లో




## సెయింట్ పీటర్స్ బసిలికాకు పోప్ ఫ్రాన్సిస్ భౌతికదేహం.. ప్రజల సందర్శనకు ఏర్పాట్లు

ఈ కబురు: కాథలిక్ క్రైస్తవ మత నాయకుడు పోప్ ఫ్రాన్సిస్ మృత దేహాన్ని వాటికన్ హోటల్ నుంచి సెయింట్ పీటర్స్ బసిలికాకు తరలించారు. మూడు రోజుల పాటు ప్రజల సందర్శనార్థం ఏర్పాటు చేశారు. భారీ ఊరేగింపుతో బసిలికాకు తీసుకెళ్లగా చివరిసారిగా పోప్‌ను చూసేందుకు సందర్శకులు తరలివచ్చారు. మొదటి పోప్ అయిన సెయింట్ పీటర్ ప్రధాన సమాధి ముందున్న పవిత్ర స్థలం కన్ఫెసియో బలిపీఠం వద్ద ఫ్రాన్సిస్ శవపేటికను ఉంచారు.

దీంతో పోప్‌కు తుది నివాళులు అర్పించేందుకు వేలాది మంది ప్రజలు సెయింట్ పీటర్స్ బసిలికాకు తరలివస్తున్నారు. మూడు రోజుల పాటు ప్రజల సందర్శనార్థం అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. కాగా, పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు ఏప్రిల్ 26న జరుగనున్నట్టు వాటికన్ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమానికి వివిధ ప్రపంచ నేతలు హాజరుకానున్నట్టు తెలుస్తోంది.

## ఎస్ఆర్‌హెచ్‌ను చిత్తు చేసిన ముంబై..



6లో

## భారీగా దిగొచ్చిన బంగారం ధరలు.. దాదాపు రూ.3వేలు తగ్గిన పసిడి



4లో

## ఉగ్రదాడిలో నేవీ అధికారి మృతి.. కలచివేస్తోన్న నవవధువు కన్నీటి వీడ్కోలు



3లో

# ముగ్గురు ఉగ్రవాదుల ఊహాచిత్రాలు విడుదల..!



మొదటి పేజీ తరువాయి

**పహల్గాం ఉగ్ర దాడికి పాల్పడిన వారి ఊహా చిత్రాలను ఏజెన్సీలు విడుదల చేశాయి.**

ఈ కబురు: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడిలో పాల్గొన్న ముగ్గురు టెర్రరిస్టుల ఊహాచిత్రాలను దర్యాప్తు బృందాలు విడుదల చేశాయి. వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించారు. మూసా, యూనిస్, ఆసిఫ్ అనే కోడ్‌నేమ్‌లు కూడా ఉన్నట్లు పీటీఐ పేర్కొంది. వీరందరూ జమ్మూకశ్మీర్ కేంద్రంగా పనిచేసే 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'లో సభ్యులు.
ఉగ్రదాడి నుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాల ప్రకారం ఈ చిత్రాలను తయారు చేశారు. టెర్రరిస్టులు పురుషులను వేరు చేసి వారి గుర్తింపులను పరిశీలిస్తున్న సమయంలో బాధితులు వారి ముఖాలను చూశారు. దీంతో జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర వేట తీవ్రమైంది. దీంతోపాటు ఓ ఉగ్రవాది ఆటోమేటిక్ ఆయుధంతో ఉన్న ఫొటోను కూడా విడుదల చేశారు.


**బైసరన్ లోయనే ఎందుకు ఎంచుకొన్నారు..?**

ఉగ్రవాదులు పర్యటకులపై దాడికి బైసరన్ లోయనే వ్యూహాత్మకంగా ఎన్నుకొన్నట్లు తెలుస్తోంది. వీలైనంత ఎక్కువ మంది ప్రాణాలు తీసేందుకు వీలుగా దీనిని లక్ష్యంగా చేసుకొన్నారు. ఈ ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు అంతగా ఉండవన్న విషయాన్ని వారు వాడుకొన్నారు. దీనికితోడు పహల్గాం నుంచి ఇక్కడికి రావాలంటే 6.5 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. అది కూడా కాలినడకన లేదా గుర్రాల పైనే సాధ్యమవుతుంది. దీంతో కచ్చితంగా భద్రతా బలగాల రాక, సహాయక చర్యలు ఆలస్యమవుతాయి. ఈ లోయ చుట్టూ చిక్కటి అటవీ ప్రాంతం ఉండటం.. మంచు కరిగిపోవడంతో ఉగ్రవాదులు పారిపోవడం కూడా తేలిక. ఇక ఇక్కడ సైన్యం ఆపరేషన్ చేపట్టినా.. వెంటనే ముష్కరులను గుర్తించలేని పరిస్థితి ఉంటుంది.

**బాడీ కెమెరాలతో చిత్రీకరించి..**

మంగళవారం సాయంత్రం 3 గంటల సమయంలో పహల్గాం దాడి మొదలైంది. ముష్కరులు బాడీ కెమెరాలతో దాడిని చిత్రీకరించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. వీటిని హెల్మెట్లకు ధరించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. తొలుత బాధితులు అందరినీ ఉగ్రవాదులు ఒకచోటుకు చేర్చి వారి గుర్తింపులను తనిఖీ చేశారు. అనంతరం హత్య చేశారు. కొందరిని స్నైపర్ వంటి టెక్నిక్స్ వాడి దూరం నుంచే కాల్చారు

## పహల్గాం ఉగ్రదాడి.. అధికారికంగా 26 మంది మృతుల వివరాలు విడుదల



మొదటి పేజీ తరువాయి

ఈ కబురు,న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాంలోని బైసారన్ ప్రాంతంలో మంగళవారం (ఏప్రిల్ 22) మధ్యాహ్నం పర్యాటకులపై ఉగ్ర ముష్కరులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. నరమేధంలోనూ ఉగ్రవాదులు ప్రదర్శించిన అంతులేని ఉన్మాదానికి టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో 26 మంది బాధితుల వివరాలను అధికారులు విడుదల చేశారు.
ఉగ్రదాడిలో మరణించిన టూరిస్టుల మృతదేహాలకు శ్రీనగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అధికారులు మృతుల వివరాల్ని అధికారింగా ప్రకటించారు. ఈ మృతుల్లో మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, పంజాబ్, కేరళ, గుజరాత్, కర్ణాటక, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన టూరిస్టులు ఉన్నారు. వీరితో పాటు నేపాల్‌కు చెందిన ఓ పర్యాటకుడు, పహల్గాంకు చెందిన స్థానికుడు ముష్కరుల దాడిలో ప్రాణాలు కోల్పోయారు.

పహల్గాం ఉగ్రదాడి.. అధికారికంగా మృతుల వివరాలు విడుదల
సుశీల్ నాథ్యాల్ - ఇండోర్
సయ్యద్ ఆదిల్ హుస్సైన్ షా - హపత్నార్, తహసిల్ పహల్గాం
హేమంత్ సుహాస్ జోషి - ముంబై
వినయ్ నార్వాల్ - హర్యానా
అతుల్ శ్రీకాంత్ మోని -మహారాష్ట్ర
నీరజ్ ఉదావాని - ఉత్తరాఖండ్
బిటన్ అధికారి - కోల్‌కతా
సుదీప్ నియుపానే - నేపాల్
శుభం ద్వివేది - ఉత్తరప్రదేశ్
ప్రశాంత్ కుమార్ సత్పతి - ఒడిశా
మనీష్ రంజన్ - బీహార్
ఎన్. రామచంద్ర - కేరళ
సంజయ్ లక్ష్మణ్ లల్లీ - ముంబై
దినేష్ అగర్వాల్ - చండీగఢ్
సమీర్ గుహార్ - కోల్‌కతా
దిలీప్ దసాలీ - ముంబై
జే. సచంద్ర మోలీ - విశాఖపట్నం
మధుసూదన్ సోమిశెట్టి - బెంగళూరు
సంతోష్ జాఘ్లా - మహారాష్ట్ర
మంజు నాథ్ రావు - కర్ణాటక
కస్తుబ గంటోవత్య - మహారాష్ట్ర
భరత్ భూషణ్ - బెంగళూరు
సుమిత్ పరమార్ - గుజరాత్
యతేష్ పరమార్ - గుజరాత్
టగెహేల్యిగ్ - అరుణాచలప్రదేశ్
శైలేష్‌భాయ్ హెచ్. హిమత్‌భాయ్ కళాథియా - గుజరాత్

హెల్ప్ లైన్ ఏర్పాటు
మరోవైపు ఉగ్రదాడి నేపథ్యంలో అనంత్ నాగ్ పోలీసులు పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. పర్యాటకులకు సహాయం చేసేందుకు, బాధితుల కుటుంబాలకు కీలకమైన సమాచారాన్ని అందించేందుకు వీలుగా పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద ఒక ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. అనంతనాగ్ హెల్ప్ డెస్క్ కోసం అధికారులు రెండు కాంటాక్ట్ నంబర్‌లను విడుదల చేశారు. వాటిలో ఒకటి 9596777669, 01932 225870, అలాగే 9419051940లో వాట్సాప్ హెల్ప్‌లైన్‌ను కూడా విడుదల చేశారు.కుటుంబసభ్యులు, పర్యాటకులు కోసం 01942457543,0194 2483651 హెల్ప్‌లైన్ నంబర్‌ల ద్వారా అధికారులను సంప్రదించవచ్చు. మరింత సమాచారం కోసం శ్రీనగర్ అదనపు డిప్యూటీ కమిషనర్ ఆదిల్ ఫరీద్ 7006058623ను సంప్రదించవచ్చు.



## ఉగ్రదాడికి త్వరలో గట్టిబదులిస్తాం: రాజ్‌నాథ్ సింగ్

మొదటి పేజీ తరువాయి

ఈ కబురు: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్రదాడి ఘటనపై కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌పై కుట్ర పన్నుతున్న వారిని ఊరికే వదలబోమన్నారు. దాడికి భారత్ గట్టిబదులిస్తుందని ఉగ్రవాదులను హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఉగ్రదాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమని.. ఉగ్రవాదులను ఎదుర్కొనే విషయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని పేర్కొన్నారు. తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

దాడికి పాల్పడిన వారిని..కుట్ర పన్నిన వారిని బయటకు లాగి, తగిన బుద్ధి చెబుతామని అన్నారు. పహల్గాం ఘటనకు సంబంధించిన విషయాలు, శ్రీనగర్‌లో భద్రతా చర్యలు వంటి వాటి గురించి ఆయన ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠితో చర్చలు జరిపిన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు. సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరగనున్న భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలోనూ ఆయన పాల్గొననున్నారు.

కశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు పర్యటకులను చుట్టుముట్టి.. అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 28 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం అడవుల్లోకి పారిపోయిన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపుచర్యలు చేపట్టాయి.

మొదటి పేజీ తరువాయి

## ముగిసిన హైదరాబాద్ ఎమ్మెల్సీ పోలింగ్.. కాంగ్రెస్ ఓట్లు ఎటువైపు?




**క్రాస్ ఓటింగ్ తో ఎవరికి ముప్పు?**

ఈ ఎన్నికలో ఎంఐఎం గెలిచే అవకాశం ఉండగా ఓడిపోతామని తెలిసినా బీజేపీ బరిలోకి దగడంతో రాజకీయం హీటెక్కింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఓటింగ్ కు దూరంగా ఉండటం, కాంగ్రెస్ పోలింగ్ లో పాల్గొనడం రాజకీయాన్ని మరింత రసకందాయంలో పరేసింది. అధికార కాంగ్రెస్ ఓట్లు ఎటువైపు అనేది ఆసక్తిగా మారింది. పోలైన మొత్తం ఓట్లలో యాభై శాతానికి ఒక్క ఓటు ఎక్కువ ఎవరికి లభిస్తే ఆ అభ్యర్థి గెలిచినట్లుగా ప్రకటిస్తారు. ఈ నేపథ్యంలో 88 ఓట్లు పోలవగా ఇందులో పార్టీల మధ్య క్రాస్ ఓటు జరిగిందా


## తెలంగాణ ప్రజల గుండె ధైర్యం భారాస: రజతోత్సవ సభాస్థలి పరిశీలనలో కేటీఆర్



"14 ఏళ్ల పాటు నిర్విరామంగా పోరాటం చేసి అన్ని వర్గాలను సమీకరించి రాష్ట్ర సాధన ఉద్యమం చేసిన పార్టీ భారాస. తెలంగాణ ప్రజల గుండె ధైర్యం బీఆర్ఎస్. గులాబీ జెండా అన్ని వర్గాలకు అండగా ఉంటుందనే పద్ధతిలో ప్రజలు గులాబీ జెండా వైపు చూస్తున్నారు. ఏ సమస్య వచ్చినా తెలంగాణ భవన్ వైపు చూస్తున్నారు. 1250 ఎకరాల్లో సభాస్థలం ఉండగా.. వెయ్యి ఎకరాలు పార్కింగ్ కోసం కేటాయించాం. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే ఏ ఒక్కరికీ ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేస్తున్నాం. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య తాగునీటి వసతి కల్పిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటుపై నమ్మకం లేనందున జెనరేటర్లు ఏర్పాటు చేశాం. భారాస చరిత్రలో ఇది భారీ బహిరంగ సభ కాబోతుంది" అన్నారు.

మొదటి పేజీ తరువాయి

# మోడీ కీలక నిర్ణయం..!! పాకిస్తాన్ ఖేల్ ఖతం



**ప్రధాని మోదీ నేతృత్వంలో భద్రతా కేబినెట్ కమిటీ సమావేశమైంది. దిల్లీలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన ఈ ఉన్నత స్థాయి భేటీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జై శంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ తదితరులు హాజరైనట్లు తెలుస్తోంది. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై చర్చ, స్పందించాల్సిన తీరు, భద్రతా చర్యలు.. తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. దాడి ఘటన గురించి ప్రధాని మోదీకి వివరించిన అమిత్ షా.. తదనంతరం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.**

ఈ కబురు:ఈ కమిటీలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఉన్నప్పటికీ.. అమెరికా పర్యటనలో ఉన్నందున హాజరుకాలేదు. అయితే, దాడి ఘటన నేపథ్యంలో ముందస్తుగా ఆ పర్యటన ముగించుకొని ఆమె స్వదేశానికి బయలుదేరారు. ఈ సమావేశంలో కేబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్, రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సహా ప్రధానమంత్రి ఇద్దరు ప్రిన్సిపల్ కార్యదర్శులు పీకే మిశ్రా, శక్తికాంతదాస్‌లు పాల్గొన్నారు.
అంతకుముందు పహల్గాం ఉగ్రదాడిపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. భారత్‌పై కుట్ర పన్నుతున్న వారిని ఊరికే వదలబోమన్నారు. ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించిన ఆయన.. భారత్ త్వరలోనే దీటుగా బదులిస్తుందన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమని.. దీనిని ఎదుర్కోవడంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని చెప్పారు

**సింధు జలాల ఒప్పందం నిలిపివేత, పాకిస్థానీయులకు నో ఎంట్రీ.. కేంద్రం సంచలన నిర్ణయం**

పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. 1960లో కుదిరిన ఇండస్ వాటర్ ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అటారీ చెక్‌పోస్టును తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో పాటు పాకిస్థాన్ పర్యాటకులు, పౌరులు వెంటనే వెళ్లిపోవాలని స్పష్టం చేసింది.

**సింధు జలాల ఒప్పందం నిలిపివేత, పాకిస్థానీయులకు నో ఎంట్రీ.. కేంద్రం సంచలన నిర్ణయం**

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భద్రతా కమిటీ సమావేశం తీవ్రంగా ఖండించింది. ఉగ్రదాడులో మృతులకు సంతాపం తెలిపింది. ఉగ్రదాడికి ప్రతిగా కీలక నిర్ణయాలు తీసుకుంది. 1960లో కుదిరిన ఇండస్ వాటర్ ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అటారీ చెక్‌పోస్టును తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో పాటు పాకిస్థాన్ పర్యాటకులు, పౌరులు వెంటనే వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. కేబినెట్ భేటీలో తీసుకున్న కీలక నిర్ణయాలను భారత విదేశంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ మీడియాకు తెలిపారు.

**కీలక నిర్ణయాలివే..**

1960లో కుదిరిన ఇండస్ జల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తోంది. ఇది తక్షణమే అమల్లోకి వస్తోంది. సరిహద్దు ఉగ్రవాదాన్ని పాక్ నిలిపివేసేంత వరకూ ఈ నిర్ణయం అమలు చేయనుంది.
అటారి ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ తక్షణమే మూసివేత. ఇప్పటికే ఆ మార్గం ద్వారా వచ్చిన వారు 2025 మే 1లోగా తిరిగి వెళ్లవచ్చు.

**పాకిస్తాన్ కు షాక్ ఇచ్చిన ఇండియా.. 48 గంటల్లో పాక్ పౌరులు ఇండియా వదిలి వెళ్లాల్సిందే**

పహల్గామ్ లో ఉగ్రదాడి జరిగిన నేపథ్యంలో పాకిస్తాన్ కు భారత్ షాక్ఇచ్చింది. భారత ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంది. 48గంటల్లో పాక్ పర్యాటకులు.. ఇండియాలో ఉంటున్న పాక్ పౌరులు ఇండియాను వదలి వెళ్లాలని పాక్ హైకమిషన్ ఆదేశాలు జారీ చేసింది. పాకిస్తాన్ దేశీయులను భారత్‌లోకి అనుమతించమని తేల్చి చెప్పింది భారత ప్రభుత్వం. ఇండియా... పాకిస్తాన్ మధ్య సింధు జలాల మధ్య ఒప్పందాన్ని నిలిపివేసింది. పహల్గామ్ దాడి వెనుక పాకిస్తాన్ హస్తం ఉందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అటారీ వాఘా సరిహద్దు చెక్ పోస్ట్‌ను మూసివేశారు.
జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్‌లో సాధారణ టూరిస్టులను టార్గెట్ చేసుకుని ముష్కరులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో 28 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు తామే పాల్పడినట్లుగా పాక్ ప్రేరేపిత లష్కరే తోయిబా ప్రాక్సీ సంస్థ "ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)" ఉగ్రసంస్థ ప్రకటించింది. ఈ దాడికి సంబంధించి పాకిస్తాన్ ప్రమేయాన్ని భారత ఇంటెలిజెన్స్ సంస్థలు కనుగొన్నాయి.
న్యూఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో ఉన్న రక్షణ, సైనిక, నౌకాదళ, వాయుసేన సలహాదారులను 'పర్సోనా నాన్ గ్రాటా'గా ప్రకటించి, వారిని వారంలోగా దేశం విడిచి వెళ్లమని ఆదేశించింది.
భారత హైకమిషన్, ఇస్లామాబాద్ నుంచి భారత్ తన సలహాదారులను వెనక్కి పిలుపు తీసుకుంది. ఈ పదవులను రద్దు చేసింది. అలాగే 5 మంది సపోర్ట్ స్టాఫ్ కూడా వెనక్కి పిలిపించనుంది. భారత్, పాకిస్తాన్ హైకమిషన్లలోని సిబ్బంది సంఖ్యను 55 నుండి 30కి తగ్గించనుంది. ఈ మార్పులు 2025 మే 1లోగా అమల్లోకి వస్తాయి. దేశ భద్రతా పరిస్థితిని సమీక్షించింది. అన్ని భద్రతా బలగాలు అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్న ఆదేశాలు ఇచ్చింది.
ఈ ఉగ్రదాడికి పాల్పడిన వారిని చట్టానికి లోబడి శిక్షించడమే కాక, వారికి మద్దతు ఇచ్చిన వారినీ చర్యలను బహిరంగంగా బహిర్గతం చేసి చర్యలు తీసుకుంటామని సంకల్పించింది. తహవ్వూర్ రాణాను భారతదేశానికి అప్పగించిన ఉదాహరణను ప్రస్తావిస్తూ, ఉగ్రవాదం పట్ల కఠినమైన ధోరణిని భారత్ కొనసాగిస్తుందని స్పష్టం చేసింది.

## హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ జపాన్ పర్యటనలో పలు కంపెనీలతో కీలక ఒప్పందాలు

మొదటి పేజీ తరువాయి



**కీలక ఒప్పంద వివరాలు:**

ఈ కబురు:హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు మారుబెని కంపెనీతో అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ ఒప్పందంలో మొత్తం అంచనా పెట్టుబడి రూ. 5 వేల కోట్లుకాగా.. తొలుత వెయ్యి కోట్లతో ప్రారంభ పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణ యువతకు 30 వేల ఉద్యోగాలు రానున్నాయి.
జపాన్‌లో 500 ఉద్యోగ నియామకాలకు టామ్ కామ్... టెర్న్.. రాజ్ గ్రూప్ సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం.. తెలంగాణ యువతకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ఆ సంస్థ అంగీకారం తెలిపింది.
రుద్రారంలో రూ. 562 కోట్లతో ఎలక్ట్రికల్ పరికరాలు తయారీ ఫ్యాక్టరీని నెలకొల్పేందుకు తోషిబా ట్రాన్స్ మిషన్ & డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా తో జపాన్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి బృందం ఒప్పందం చేసుకుంది.
రూ. 10 వేల 500 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్ లో ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు డేటా, నెయిసా కంపెనీలతో అంగీకారం కుదుర్చుకుంది.
గత వారం రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి జపాన్ లో బిజి బిజీగా పర్యటించారు. సీఎం నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం జపాన్ పర్యటనను నేటితో విజయవంతంగా ముగించింది. ఈ పర్యటన ద్వారా తెలంగాణకు భారీ స్థాయిలో పెట్టుబడులు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. ఇప్పటివరకు సీఎం రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనలో మొత్తం రూ.12,062 కోట్ల విలువైన పెట్టుబడులు, దాదాపు 30వేలకు పైగా ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ వారం రోజులు సీఎం రేవంత్ బృందం ఏ సాధించిందో చూద్దాం.

**ముఖ్యమైన ఒప్పందాలు..**

తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం జపాన్ పర్యటనలో తొలి రోజునే కీలక పెట్టుబడి ఒప్పందాలను కుదుర్చుకుంది. జపాన్‌కు చెందిన వ్యాపార దిగ్గజం మరుబెనీ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు మరుబెనీ ఓకే చెప్పింది. మరుబెనీ కంపెనీ మొదట రూ.1000 కోట్ల ప్రారంభ పెట్టుబడితో ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో దశలవారీగా ప్రపంచ స్థాయి నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించింది. దీని ద్వారా 5 వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించే అంచనా ఉంది. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటయ్యే ఈ పార్క్ తో తెలంగాణలో సుమారు 30 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభించే ఛాన్సెస్ ఉన్నాయి. మరుబెనీ ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలో 410కి పైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

**రూ.10,500 కోట్లతో కీలక ఒప్పందం..**

హైదరాబాద్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఎన్‌టీటీ డేటా, నెయిసాతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా దాదాపు రూ.10,500 కోట్లతో కంపెనీ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. అలాగే రేవంత్ సర్కార్ మరో కంపెనీతో కీలక ఒప్పందం చేసుకుంది. రుద్రారంలో విద్యుత్ పరికరాల తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటుకు తోషిబా ట్రాన్స్ మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా (టీటీడీఐ) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా కంపెనీ రూ.562 కోట్ల రూపాయలతో ప్రాజెక్టును చేపట్టనుంది.

**500 మందికి ఉద్యోగ అవకాశాలు..**

జపాన్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం మరో కంపెనీతో ఉద్యోగ నియామకాలకు సంబంధించి కీలక ఒప్పందం కుదుర్చుకుంది. జపాన్‌లో 500 ఉద్యోగ నియామకాలకు టామ్‌కామ్, టెర్న్, రాజ్ గ్రూప్ సంస్థల మధ్య కీలక ఒప్పందం కుదిరింది.
జపాన్ పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్ రెడ్డి బృందం రేపు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానుంది. హైదరాబాద్ కు వచ్చాక సీఎం నేరుగా సంగారెడ్డికి వెళ్లనున్నారు. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి కుమార్తె ఎంగేజ్‌మెంట్ కార్యక్రమానికి సీఎం రేవంత్ హాజరుకానున్నారు.





రహదారిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు, దుకాణాలను తొలగిస్తున్న దృశ్యం

## శ్రీరామ్ నగర్ కాలనీలో రహదారి

# ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
కొండాపూర్ శ్రీరామ్ నగర్ కాలనీలో రహదారులు, ఫుట్ పాత్ లను ఆక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాలు, వాణిజ్య సముదాయాలను బుధవారం జిహెచ్ఎంసి అధికారులు కూల్చివేశారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఈ కూల్చివేతలు చేపట్టారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొండాపూర్ శ్రీరామ్ నగర్ ఏబిసి బ్లాక్ లలో అంతర్గత రహదారుల మీద ఏర్పాటు చేస్తున్న టిఫిన్ సెంటర్లు, తోపుడు బండ్లు, వాణిజ్య సముదాయాల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సోమవారం జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిహెచ్ఎంసి అధికారులు బుధవారం కుల్చివేతలు చేపట్టారు. పలు భవనాల యజమానులు కనీస సెట్ బ్యాక్ వదిలిపెట్టకుండా రహదారిని ఆక్రమించి చేపట్టిన స్టెయిర్ కేస్, ర్యాంప్ లను జెసిబిలతో కూల్చివేశారు. శ్రీరామ నగర్ ఏబిసి కాలనీల్లో అంతర్గత రహదారులు, ఫుట్ పాత్ లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా, దుకాణాలు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

**మెయిన్ రోడ్డుపై ఆక్రమణల సంగతేమిటి..**
కాగా శ్రీరామ్ నగర్ కాలనీ అంతర్గత రహదారులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించిన అధికారులు ప్రధాన రహదారిని ఆక్రమించి కొనసాగుతున్న నిర్మాణాల జోలికి వెళ్లలేదు. లింగంపల్లి వైపు నుంచి హైటెక్ సిటీకి వెళ్లేందుకు వాహనదారులు ఇదే రహదారిని ఉపయోగిస్తుంటారు ఉదయం, సాయంత్రం వేళల్లో శ్రీరాంనగర్ వద్ద తీవ్ర ట్రాఫిక్ రద్దీతో వాహనదారులు నిత్య నరకం చూస్తున్నారు. ఈ రహదారి మొత్తం 120 ఫీట్లకు విస్తరించగా శ్రీరామ్ నగర్ కాలనీ వద్ద 80 ఫీట్ల రహదారి మాత్రమే ఉంది. ఇప్పటికే రహదారి ఇరుకుగా మారి ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుండగా ఫుట్ పాత్ లను ఆక్రమించి వాణిజ్య సముదాయాలు, తోపుడు బండ్లు ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు మాస్టర్ ప్లాన్ నిబంధనలకు విరుద్ధంగా టౌన్ ప్లానింగ్ అధికారులు రహదారి విస్తరణ ఉన్నా భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేస్తుండడంతో శ్రీరామ్ నగర్ కాలనీలో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. అంతర్గత రహదారిపై ఆక్రమణలను తొలగించిన అధికారులకు ప్రధాన రహదారిపై ట్రాఫిక్ కు ఇబ్బందిగా మారిన ఆక్రమణలు కనిపించలేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

# గచ్చిబౌలి నవోదయలో పారాస్పోర్ట్స్ టాలెంట్ హంట్

**ప్రారంభించిన మిసెస్ ఇండియా శిల్పారెడ్డి**

**ఈ-కబురు,శేరిలింగంపల్లి :**
గచ్చిబౌలిలోని జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో పారా అథ్లెట్ల జాతీయ టాలెంట్ హంట్, ట్రైనింగ్ క్యాంప్ బుధవారం ప్రారంభమైంది. జవహర్ నవోదయ విద్యాలయ, ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఏఎంఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్యాంపును బుధవారం ఏఎంఎఫ్ ట్రస్టీ, మిసెస్ ఇండియా, ఫ్యాషన్ డిజైనర్, హోలిస్టిక్ లైఫ్ స్టైల్ ఇన్ఫ్లువెన్సర్ శిల్పా రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. బుధవారం ప్రారంభమైన ఈ క్యాంప్ ఈనెల 28వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ క్యాంప్ 2028 పారాలింపిక్స్, 2026 కామన్వెల్త్ గేమ్స్, 2026 ఆసియా గేమ్స్ లక్ష్యంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిల్పా రెడ్డి మాట్లాడుతూ ఆదిత్య మెహతా ఫౌండేషన్తో గత పన్నెండేళ్ల నుంచి అనుబంధం ఉందన్నారు. నవోదయ విద్యాలయ సమితిలో ఈ శిబిరాన్ని ఎంతో దూరదృష్టితో నిర్వహిస్తున్నామన్నారు. యువ ప్రతిభావంతులైన అథ్లెట్లకు అత్యుత్తమ అనుభవం కల్పించడమే లక్ష్యమన్నారు. ప్రతి సంవత్సరం ఈ ప్రోగ్రాం విస్తరిస్తూ ఉందన్నారు.



టాలెంట్ హంట్ ను ప్రారంభిస్తున్న శిల్పా రెడ్డి తదితరులు



నవోదయ క్యాంపులో పోటీ పడుతున్న విద్యార్థులు

ప్రతి ఏడాది కొత్త చాంపియన్లు వెలుగులోకి వస్తున్నారని చెప్పారు. ఒకవేళ ఎంపిక కాకపోయినా.. ప్రతి విద్యార్థి ఒక మంచి జ్ఞాపకంతో వెళ్తున్నారని, పరిమితులు ఉన్నప్పటికి సాధ్యమైనంత వరకు ఎక్కువ మందిని ఎంపిక చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. తమ దృష్టి లో ప్రతి ఒక్కరూ చాంపియన్లే అన్నారు. నేటి యువతకు క్రీడలపై ఉన్న నిబద్ధతను చూస్తే ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇప్పటి వరకు పది వేల మంది పైగా పారా అథ్లెట్లు స్క్రీనింగ్, శిక్షణ, కౌన్సెలింగ్ పొందారన్నారు. కేవలం నవోదయ విద్యాలయాల నుంచే 3,500 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఈ కార్యక్రమం ద్వారా స్క్రీనింగ్, కౌన్సెలింగ్, శిక్షణ పొందారని చెప్పారు. ఆదిత్య మెహతా ఫౌండేషన్ అథ్లెట్లు విదేశాల్లో సైతం 300 పైగా అంతర్జాతీయ పతకాలు గెలుచుకున్నారని తెలిపారు. ఈ ఏడాది మనకు యూత్ ఆసియన్ గేమ్స్, వచ్చే సంవత్సరం ఆసియన్ గేమ్స్ ఉన్నాయన్నారు. ఇవి 2028 పారాలింపిక్స్ కోసం అథ్లెట్ల ఎంపిక ప్రక్రియలో కీలకమైన దశలు అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నవోదయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఈ కార్యక్రమంలో భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. సరైన శిక్షణ అందిస్తే అంతర్జాతీయ స్థాయిలో అద్భుతంగా రాణిస్తారని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ, ఆదిత్య మెహతా సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడి ఎఫెక్ట్... రాష్ట్రాన్ని వీడుతున్న వేలమంది టూరిస్టులు



ఈ కబురు : జమ్ముకాశ్మీర్లోని పహల్గామ్ లో మంగళవారం ఉగ్రవాదులు టూరిస్టుల మీద కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 28 మంది మరణించగా.. మరో 20 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పలు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ భీకర ఉగ్రదాడికి వణికిపోయిన పర్యాటకులు కాశ్మీర్ ను వీడుతున్నారు. బుధవారం కేవలం 6 గంటల్లోనే 2 ఓ విమానాల్లో 3400 మంది ప్రయాణికులు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయారు. శ్రీనగర్ ఎయిర్పోర్టులో పర్యాటకుల రద్దీ పెరగడంతో.. వారికి విమానాశ్రయ సిబ్బంది ఆహారం, నీళ్ళు అందించారు.

ప్రయాణికులను చెరవేసేందుకు మరిన్ని ఫ్లైట్లు అందుబాటులో ఉంచుతామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కాగా జమ్ము కాశ్మీర్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ఆ రాష్ట్ర సీఎం ఒమర్ అబ్దుల్లా స్పందించారు. పర్యాటకులు రాష్ట్రాన్ని వీడుతుంటే బాధగా ఉందన్నారు. అయినప్పటికీ వారి పరిస్థితిని అర్థం చేసుకోగలను అని తెలిపారు. అదనపు విమానాలతోపాటు రోడ్డు మార్గంలోనూ పర్యాటకులకు రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నట్టు వెల్లడించారు.

## ఉగ్రదాడిలో నేవీ అధికారి మృతి.. కలచివేస్తోన్న నవవధువు కన్నీటి వీడ్కోలు



.ఈ కబురు: నిండు నూరేళ్ల జీవితాన్ని పంచుకోవాలని.. కోటి ఆశలతో అత్తవారింట్లో అడుగుపెట్టిన నవవధువుకు ఉగ్రదాడి తీరని శోకాన్ని మిగిల్చింది. పెళ్లై వారం కూడా గడవక ముందే.. తన కళ్ల ముందే జీవచ్ఛవంలా మారిన భర్తను చూసి హతాశురాలైంది. ఎవరిని నిందించినా తన జీవితం తనకు తిరిగిరాదని.. భర్తకు తుది వీడ్కోలు పలుకుతూ ఆమె రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది. ఇంతటి విషాదంలోనూ ఎంతో గర్వంగా సెల్యూట్ చేస్తూ తన భర్తను సాగనంపుతున్న తీరు మెలిపెడుతోంది. హరియాణాకు చెందిన 26 ఏళ్ల లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అతడి మృతదేహాన్ని నేటి ఉదయం దిల్లీకి తరలించారు. వినయ్కు ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న ఆమెను చూస్తూ అక్కడున్న వారంతా కన్నీరు మున్నీరుగా విలపించారు. పుట్టెడు దుఃఖంలోనూ భర్త మరణం పట్ల గర్వపడుతూ సాగనంపారామె. ''ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. అతడి వల్లే మేమింకా ప్రాణాలతో ఉన్నాం. నా భర్త మరణం పట్ల నేనెంతో గర్వపడుతున్నా'' అని వినయ్ నర్వాల్ భార్య అన్నారు. వీసాలు రిజెక్ట్ కావడంతో..ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. కాగా.. నర్వాల్ రెండేళ్ల క్రితమే నౌకాదళంలో చేరారు. కేరళలోని కోచిలో విధులు నిర్వహిస్తున్న ఆయన ఇటీవల వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఏప్రిల్ 16న వివాహమవగా.. 19న విందు నిర్వహించారు. అనంతరం భార్యను తీసుకొని జమ్మూకశ్మీర్కు హనీమూన్కు వెళ్లారు. తొలుత హనీమూన్ కోసం యూరప్ వెళ్లాలని నిర్ణయించుకున్న ఈ నవ జంట.. తమ వీసాలు రిజెక్ట్ కావడంతో జమ్మూకశ్మీర్కు వచ్చింది. ఈ క్రమంలోనే మంగళవారం పహల్గాంలో సైనిక దుస్తువుల్లో వచ్చిన ఉగ్రవాదులు పురుషులే లక్ష్యంగా కాల్పులు జరిపారు. అమాయకుల ప్రాణాలు తీసి వారి ఉసురు పోసుకున్నారు. ఈ దాడుల్లో 28 మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మరికొందరు ప్రాణాలతో తప్పించుకున్నారు. ఈ మారణహోమాన్ని ప్రత్యక్షంగా చూసిన మృతుల కుటుంబాల బాధ వర్ణనాతీతం. అసలైన సైనికులను చూసినా భయంతో వణికిపోతున్నారు.

## జమ్మూకశ్మీర్లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు..



ఈ కబురు: జమ్మూకశ్మీర్ లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు ఉన్నారని భద్రతా సంస్థలు వెల్లడించాయి. వారిలో అత్యధికంగా లష్కరే తయ్యిబా ముఠా సభ్యులున్నారని పేర్కొన్నాయి. భద్రతా దళాలు నిర్వహిస్తున్న రికార్డుల ఆధారంగా ఈ విషయం వెల్లడవుతోంది. వారిలో 18 మంది జైషే మహమ్మద్, 35 మంది లష్కరే ముఠాలకు చెందినవారని వాటిని బట్టి తెలుస్తోంది. ముగ్గురికి హిజ్బుల్ ముజాహిద్దీన్తో సంబంధం ఉందని, వారు కూడా పాకిస్థాన్కు చెందినవారని భద్రతా సంస్థలకు చెందిన అధికారి ఒకరు వెల్లడించారు. ఇక 17 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నారు. విదేశీ ఉగ్రవాదులతో పోల్చుకుంటే ఆ సంఖ్య తక్కువగా ఉంది. ఈ విదేశీ ఉగ్రవాదుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. కశ్మీర్లో కొంతకాలం నుంచి పర్యాటకుల తాకిడి పెరిగిన నేపథ్యంలో ఉగ్రవాదులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు భద్రతా దళాలు భావిస్తున్నాయి. పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్న 'లష్కరే తయ్యిబా' అనుబంధ విభాగం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ దాడికి తెగబడినట్లు ప్రకటించుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన ఉగ్రమూకలు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని తెలుస్తోంది. కాల్పుల అనంతరం సమీప అడవుల్లోకి పారిపోవడంతో భద్రతా సిబ్బంది గాలిస్తున్నారు.కశ్మీర్లో మినీ స్విట్జర్లాండ్గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడి కి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3 గంటల సమయం సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యటకులను చుట్టుముట్టి.. అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఘటన అనంతరం అడవుల్లోకి పారిపోయిన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చేపట్టాయి. ఘటన నేపథ్యంలో ఎన్ఐఏ రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టింది. మరోవైపు ఉగ్రదాడి దృష్ట్యా దిల్లీలోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇదిలా ఉంటే.. జమ్మూకశ్మీర్లోని పహల్గాం ఉగ్ర దాడిలో పాల్గొన్న ముగ్గురు టెర్రరిస్టుల ఊహాచిత్రాలను దర్యాప్తు బృందాలు విడుదల చేశాయి. వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించారు

## పీసీసీ అబ్జర్వర్ల నియమకం.. పరిశీలకులుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు




తెలంగాణ పీసీసీ అబ్జర్వర్ల నియమకాన్ని ప్రకటిచింది. బుధవారం గాంధీ భవన్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరిశీలకు మీటింగ్లో నియమకాన్ని టీపీసీసీ వెల్లడించింది. ఇందులో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటుగా సీనియర్లను తెలంగాణలో 35 జిల్లాలకు ఇద్దరు చొప్పున పీసీసీ అబ్జర్వర్లను నియమించింది. ఈ పరిశీలకు నియమకంలో మహిళ నేతలకు సైతం అవకాశం కల్పించారు. ప్రస్తుతానికి మహిళలకు ఇచ్చిన అవకాశంపై తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. ఇంకా కూడా కొందరికి ఛాన్స్బాగుంటుందని ఆమె అభిప్రాయపడినట్లు సమాచారం. పరిశీలకుల్లో ఎమ్మెల్యేలు డా. బి. మురళీ నాయక్, నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు బల్మూర్ వెంకట్, అద్దంకి దయాకర్, మహిళలు భీమగంటి సౌజన్యగౌడ్, రవళిరెడ్డి, లకావత్ ధన్వంతి, బొజ్జ సంధ్యారెడ్డి ఉన్నారు. మొత్తంగా ఈ 70 మంది అబ్జర్వర్లు గ్రామస్థాయి నుంచి పర్యటించడంతో పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి, అధిష్టానానికి అందజేయనున్నారు.

అబ్జర్వర్ల కీ రోల్ ... పదవుల కోసం అభిప్రాయ సేకరణ

ఈనెల 25వ తేదీ నుంచి మొదలు మే 20వ తేదీ వరకు ప్రజా క్షేత్రంలో ఉండి ఢిఫరెంట్ లెవల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. మొదట 25 నుంచి 30వ తేదీ మధ్యన జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మీటింగ్లో పరిశీలకులు జిల్లాలకు సంబంధించి మండలాలు ఎన్ని, ఇప్పుడు అధ్యక్షులు ఎవరున్నారు. వారి పూర్తి వివరాలు సేకరిస్తారు. ఇంకా పదవులకు సంబంధించిన ప్రపోజల్స్ సేకరిస్తారు. ముఖ్యంగా జిల్లా నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు కూడా తీసుకుంటారు. కేవలం నాయకులను కలిసి వారి ఇచ్చిన వివరాలతోనే సరిపుచ్చుకోకుండా అసలు కార్యకర్తల నుంచి సమగ్ర రిపోర్టును తీసుకోకున్నారు. పదవులకు సంబంధించి కార్యకర్తల మనసులో ఎవరి పేరున్న దానిపై తెలుసుకోవాల్సిన బాధ్యతను అధిష్టానం అప్పగించింది. ఇలా జిల్లా స్థాయి తరువాత మండల స్థాయిలో సైతం ఇదే రకమైన సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రతి గ్రామం నుంచి ముఖ్యమైన కార్యకర్తల నుంచి గ్రామ, మండల అధ్యక్షులు, మండల కమిటీ, బ్లాక్కమిటీలను కన్సోల్డేట్ చేసి ప్రపోజల్స్చేయనున్నారు. ఒక బ్లాక్అయితే మూడు పేర్లు... మండల్ అయితే ఐదు పేర్లు, విలేజ్మూడు పేర్లు అట్లా ప్రపోజ్చేసి పీసీసీ అధ్యక్షుల వారికి పంపించాల్సి ఉంటుంది. పీసీసీ కమిటీ అంతా కూర్చొని ఎవరెవరీని ఎక్కడా నియమించాలన్నది నిర్ణయం తీసుకుంటారు. ఈ ఎక్సర్ సైజ్ప్రక్రియ పూర్తయ్యాక డీసీసీ ప్రెసిడెంట్ ఎవరున్నారు..దానిపై చర్చించి వీరి నుంచి అభిప్రాయం తీసుకుంటారు. ఈ విషయంలో కూడా రిపోర్టు ఇవ్వనున్నారు. డీసీసీ ప్రెసిడెంట్ నిర్ణయం అంతా కూడా చర్చలోనే ఉన్నది. ఏఐసీసీ నుంచి ఎవరైనా అబ్జర్వర్లు వచ్చి డీసీసీ ప్రెసిడెంట్ నిర్ణయంలో పాత్ర పోషించనున్నారు. ఈనెల 25వ తేదీ నుంచి మొదలు మే 20వ తేదీ వరకు ప్రాసెస్ పూర్తయ్యాక చివరగా డీసీసీ ప్రెసిడెంట్ ప్రక్రియ కొనసాగనుంది. గుజరాత్రాష్ట్రం మాదిరి ప్రతి జిల్లాకు ఒక ఏఐసీసీ అబ్జర్వర్లను పంపించడం జరిగింది. అదే రకంగా ఏఐసీసీ పాలసీలో ఇక్కడ అమలు చేయనున్నట్లు తెలుస్తోంది.

## పహల్గాం ఉగ్ర ఘటన.. ఖండించిన ప్రపంచ దేశాలు





**జమ్మూకశ్మీర్లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర ఘటనను ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి.**

ఈ కబురు: జమ్మూ కశ్మీర్లోని పహల్గాంలో సాయుధ మూక పాల్పడిన అనాగరిక చర్యను ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ దీనిని హేయమైన చర్యగా అభివర్ణించారు. అమాయకులైన పౌరులపై దాడులు ఆమోదయోగ్యం కాదన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దంపతులు ఈ ఘటనపై స్పందిస్తూ.. పహల్గామ్లో జరిగిన విధ్వంసకర ఉగ్రవాద దాడి బాధితులకు సంతాపం తెలియజేశారు.జమ్మూకశ్మీర్లో పర్యటకులపై దాడి వార్త దిగ్భ్రాంతి కలిగించింది. ఇది అమానవీయ చర్య. బాధితులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాం. అన్నిరకాల ఉగ్రవాదాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. చైనా రాయబారి జు ఫీహాంగ్భారత ప్రభుత్వానికి, ప్రజలకు, బాధితుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేస్తున్నాం. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాం. ఉగ్రవాదంపై పోరాటంలో శ్రీలంక.. భారత్కు ఎప్పుడూ తోడుగా ఉంటుంది శ్రీలంక విదేశాంగ మంత్రిత్వ శాఖపహల్గాంలో జరిగిన అనాగరిక ఉగ్రవాద దాడి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం. ఉగ్రవాదంపై పోరాటంలో ఇజ్రాయెల్ భారత్తో కలిసి పనిచేస్తుంది'' ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహూపహల్గాం ఘటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఇటువంటి అమానవీయ చర్యలు బాధాకరం. బాధిత కుటుంబాలకు, భారత్కు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం ఇటలీ ప్రధాని జార్జియా మెలోని పహల్గాంలో జరిగిన భయంకరమైన ఉగ్రవాద దాడి అమాయకుల ప్రాణాలను బలిగొంది. బాధితుల దృశ్యాలు కలిచివేస్తున్నాయి. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో మాల్దీవుల ప్రభుత్వం స్థిరంగా ఉంది. ఈ క్లిష్ట సమయంలో భారత్కు మద్దతుగా ఉంటాం. మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు భారతదేశంలో జరిగిన ఒక దారుణమైన ఉగ్రదాడిలో డజన్ల కొద్దీ పౌరులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ జమ్మూ కశ్మీర్లోని పహల్గాంలో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడిని ఖండిస్తున్నాం. ఇందులో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. ఈయూ ఎప్పటికీ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటుంది. ఈయూ విదేశాంగ వ్యవహారాల ప్రతినిధి కాజా కల్లాస్జమ్మూలో జరిగిన క్రూరమైన దాడిని వ్యతిరేకిస్తున్నాం. అమాయక ప్రజల మరణం తీవ్రంగా కలిచివేసింది. ఈ కష్ట సమయంలో జర్మనీ భారత్ వెంట ఉంటుంది. బాధితుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం. జర్మనీ విదేశాంగ కార్యాలయం ఈ నేరపూరిత చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా భద్రత, స్థిరత్వాన్ని దెబ్బతీసే లక్ష్యంతో జరిగే అన్నిరకాల ఉగ్రవాద చర్యలను ఖండిస్తున్నాం'' యూఏఈ విదేశాంగ మంత్రిత్వ శాఖ

## రేపటి నుంచి పాఠశాలలకు సమ్మర్ హాలీడేస్



ఈ కబురు: రాష్ట్రంలోని పాఠశాలలకు రేపటి నుంచి నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈనెల 24 నుంచి జూన్ 11 వరకూ ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, ఇతర గురుకులాలు మూతపడనున్నాయి. జూన్ 12న 2025-26 కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానున్నది. కాగా, 2024-25 అకాడమిక్ ఇయర్ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా బడుల్లో పేరెంట్స్ సమావేశాలు నిర్వహించి, స్టూడెంట్లకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. కాగా, సెలవుల్లో క్లాసులు నిర్వహించొద్దని అధికారులు హెచ్చరించారు.



## లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

బుధవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు, ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 406.40 పాయింట్లు లేదా 0.51 శాతం లాభంతో 80,001.99 వద్ద, నిఫ్టీ 115.10 పాయింట్లు లేదా 0.48 శాతం లాభంతో 24,282.35 వద్ద నిలిచాయి.

మైండ్‌టెక్ (ఇండియా), వర్ధమాన్ స్పెషల్ స్టీల్స్, సిగ్మా సాల్వ్, ఆప్టెక్, మోదీ రబ్బర్ వంటి కంపెనీలు లాభాల జాబితాలో చేరాయి. వీడోల్ కార్పొరేషన్, జమ్మూ అండ్ కాశ్మీర్ బ్యాంక్, ఉమా ఎక్స్‌పోర్ట్స్, రవి కుమార్ డిస్టిలరీస్, డిజైన్ అండ్ టెక్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.




## టాటా కమ్యూనికేషన్స్ లాభం డబుల్

**ప్రయివేట్ రంగ సంస్థ టాటా కమ్యూనికేషన్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపుపైగా వృద్ధితో రూ. 761 కోట్లను అధిగమించింది. సహచర కంపెనీకి చెన్నైలోని భూమిని విక్రయించడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 346 కోట్లు ఆర్జించింది.**

ఈ ఆర్థిక సంవత్సరం(2025-26)లో 30కోట్ల డాలర్ల(సుమారు రూ. 2,550 కోట్లు) పెట్టుబడులు వెచ్చించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. గతేడాది 27 కోట్ల డాలర్లు కేటాయించినట్లు తెలియజేసింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం 6 శాతంపైగా పుంజుకుని రూ. 6,059 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 6 శాతం పెరిగి రూ. 5,723 కోట్లకు చేరాయి. చెన్నైలోని భూమి అమ్మడంతో రూ. 577 కోట్లమేర అదనపు లాభం ఆర్జించినట్లు కంపెనీ పేర్కొంది.

అంతేకాకుండా టాటా కమ్యూనికేషన్స్ పేమెంట్స్ సొల్యూషన్స్‌లో వాటా విక్రయం ద్వారా రూ. 311 కోట్లు అందుకున్నట్లు తెలియజేసింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 23,238 కోట్ల ఆదాయం సాధించింది. మార్చికల్లా రూ. 9,377 కోట్ల రుణభారం నమోదైంది.

**హావెల్స్ రూ. 6 డివిడెండ్**

కన్జూమర్ ఎలక్ట్రికల్ గూడ్స్ దిగ్గజం హావెల్స్ ఇండియా గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 16 శాతం వృద్ధితో రూ. 517 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 447 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 20 శాతం ఎగసి రూ. 6,544 కోట్లకు చేరింది.

అంతక్రితం క్యూ4లో రూ. 5,442 కోట్ల టర్నోవర్ సాధించింది. వాటాదారులకు షేరుకి రూ. 6 తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 16 శాతం పుంజుకుని రూ. 1,470 కోట్లను తాకింది. 2023-24లో రూ. 1,271 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఇక మొత్తం ఆదాయం 17 శాతంపైగా బలపడి రూ. 22,081 కోట్లుగా నమోదైంది



## భారీగా దిగొచ్చిన బంగారం ధరలు.. దాదాపు రూ.3వేలు తగ్గిన పసిడి

**బంగారం ధర తగ్గుముఖం పట్టింది. పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర దాదాపు రూ.3 వేలు తగ్గింది.**

**దిల్లీ:** అంతర్జాతీయ పరిణామాలతో దేశీయ మార్కెట్‌లో ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిన బంగారం ధర బుధవారం కాస్త దిగొచ్చింది. 10 గ్రాముల పుత్తడి ధర దాదాపు రూ.3వేలు తగ్గింది. బుధవారం 11 గంటల సమయంలో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పసిడి ధర రూ.98,700గా ఉంది. అటు వెండి ధర కూడా స్వల్పంగా తగ్గింది. బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.98,720గా ఉంది.

మంగళవారం నాటి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీ ట్రేడింగ్‌లో జూన్ నెల డెలివరీ కాంట్రాక్ట్ ధర ఇంట్రాడేలో రూ.99,358 వద్ద సరికొత్త రికార్డును తాకిన సంగతి తెలిసిందే. బుధవారం ఈ ధర కూడా తగ్గుముఖం పట్టింది. నేడు రూ.96,500 వద్ద ప్రారంభమైన ఈ ధర.. ఇంట్రాడేలో రూ.95,457 వద్ద కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్సు బంగారం ధర 3,320.40 డాలర్లు పలికింది. నిన్న ఈ ధర 3,467 డాలర్లు దాటింది.

చైనాతో వాణిజ్య ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సానుకూల వ్యాఖ్యలు చేయడంతో అగ్రరాజ్య మార్కెట్లు లాభాలను దక్కించుకున్నాయి. డాలర్ విలువ కూడా బలపడుతోంది. ఈ పరిణామాలన్నీ బంగారం ధరపై ప్రభావం చూపించాయని నిపుణులు చెబుతున్నారు. "వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయ మార్కెట్లు పసిడి ధరను ప్రభావితం చేస్తున్నాయి. సాంకేతికంగా చూస్తే.. రానున్న రోజుల్లో పుత్తడి మరింత దిగిరావొచ్చు" అని కేడియా అడ్వైజరీ డైరెక్టర్ అజయ్ కేడియా అభిప్రాయం వ్యక్తం చేశారు. మరోవైపు ఏప్రిల్ 30న అక్షయతృతీయ నాటికి బంగారం ధరలు తగ్గకపోతే అమ్మకాలపై ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు

# ఏఐ ఆధారిత ఉద్యోగాలకు గిరాకీ

**దేశీయ ఉద్యోగ విపణిలో కృత్రిమ మేధ (ఏఐ)కు ప్రాధాన్యం పెరుగుతోందని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ నివేదిక వెల్లడించింది. ఏఐ సంబంధిత ఉద్యోగాలకు తాజా ఉత్తీర్ణుల (ఫ్రెషర్స్)ను ఎంపిక చేసుకునేందుకు ఉద్యోగ సంస్థలు ముందుకొస్తున్నాయని పేర్కొంది.**

**తాజా ఉత్తీర్ణులపై 74% కంపెనీల దృష్టి**
**టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ నివేదిక**

**ముంబయి:** దేశీయ ఉద్యోగ విపణిలో కృత్రిమ మేధ (ఏఐ)కు ప్రాధాన్యం పెరుగుతోందని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ నివేదిక వెల్లడించింది. ఏఐ సంబంధిత ఉద్యోగాలకు తాజా ఉత్తీర్ణుల (ఫ్రెషర్స్)ను ఎంపిక చేసుకునేందుకు ఉద్యోగ సంస్థలు ముందుకొస్తున్నాయని పేర్కొంది. 2025 జనవరిజూన్‌లో 74 శాతానికి పైగా కంపెనీలు ఫ్రెషర్స్‌ను నియమించుకునేందుకు సిద్ధంగా ఉన్నాయని 'కెరీర్ అవుట్‌లుక్' నివేదికలో టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ తెలిపింది. దేశ వ్యాప్తంగా 649 యజమాన్య సంస్థలను సర్వే చేసి ఈ నివేదికను రూపొందించినట్లు వివరించింది.

**పట్టా కాదు.. నైపుణ్యమే కీలకం**

కంపెనీల నిర్వాహకులు డిగ్రీ పట్టాల ఆధారంగా నియామకాలు చేయదలచుకోవడం లేదు. డేటా విజువలైజేషన్, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ వంటి రంగాల్లో నైపుణ్యాలున్న వారికే ప్రాధాన్యం ఇస్తున్నారు. 'ఫ్రెషర్లు అధిక ప్రభావవంత ఉద్యోగాల్లోకి అడుగుపెట్టడానికి, పరిశ్రమల్లో ఆవిష్కరణలకు కీలక చోదకులుగా మారడానికి ఈ మార్పు అద్భుతంగా ఉపయోగ పడుతుంద'ని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ హెడ్ ఆఫ్ ఎంప్లాయిబిలిటీ బిజినెస్ అండ్ సీఓఓ జైదీప్ కేవాల్‌రమణి వెల్లడించారు.



- ఇకామర్స్, టెక్నాలజీ అంకురాల నిర్వాహకుల్లో 70% మంది కూడా తాజా ఉత్తీర్ణులను నియమించుకోవాలని యోచిస్తున్నారు. తయారీ రంగంలో 66%, ఇంజినీరింగ్‌మౌలిక సదుపాయాల రంగంలో 62% మంది నిర్వాహకులూ ఫ్రెషర్స్‌ను నియమించుకోవాలని చూస్తున్నారని నివేదిక వెల్లడించింది.
- బెంగళూరు, ముంబయి, చెన్నై వంటి నగరాలు కీలక ఉపాధి కేంద్రాలుగా ఉన్నాయి. ఈ నగరాల్లో నియామక అవకాశాలు వరుసగా 78%, 65%, 57 శాతంగా ఉన్నాయి.
- రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, పర్ఫార్మెన్స్ మార్కెటింగ్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, ఫైనాన్షియల్ రిస్క్ అనాలిసిస్‌ను అర్థం చేసుకునే ప్రతిభను కంపెనీలు కోరుకుంటున్నాయి.
- అవసరమైన టెక్నాలజీ టూల్స్‌లో ప్రొడక్టివిటీ అండ్ కొలాబరేషన్ టూల్స్ (83%), ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ (73%), డేటా విజువలైజేషన్ టూల్స్ (64%)కు యజమానులు ప్రాధాన్యం ఇస్తున్నారు.

# భారత్‌లో పెట్టుబడులు పెట్టండి

**సాంకేతిక సహకార అవకాశాలు అందిపుచ్చుకోండి**
**ఐటీ దిగ్గజాలకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పిలుపు**



**శాన్‌ఫ్రాన్సిస్కో:** భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు భారీ అవకాశాలు ఉన్నాయని ఐటీ దిగ్గజాలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సాంకేతిక సహకారం, ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా పర్యటన సందర్భంగా గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్, ట్యూరింగ్ సీఈవో జొనాథన్ సిద్ధార్థ్, డేటా రోబో సీఈవో దేబాంజన్ సాహా తదితరులతో మంత్రి సమావేశమయ్యారు. మేకిన్ ఇండియా నినాదం కింద భారత్‌తో పాటు ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఇక్కడ టెక్నాలజీని అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలించాలని థామస్ కురియన్ బృందాన్ని ఆమె కోరారు.

భారత ఏఐ మిషన్‌ను ఈ సందర్భంగా కురియన్ ప్రశంసించారు. మరోవైపు, సిద్ధార్థ్‌తో సమావేశంలో కృత్రిమ మేధకు సంబంధించి భారత్ పాలసీలను మంత్రి వివరించారు. ఏఐ విభాగంలో భారతీయ సంస్థలతో కలిసి పనిచేయడంపై సిద్ధార్థ్ ఆసక్తి వ్యక్తం చేసినట్లు ఎక్స్‌లో ఆర్థిక శాఖ పోస్ట్ చేసింది. కృత్రిమ మేధలో సూపర్‌పవర్‌గా ఎదిగే సత్తా భారత్‌కి ఉందని, ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో తాము కూడా భాగం కావాలని భావిస్తున్నట్లు నిర్మలా సీతారామన్‌కి దేబాంజన్ సాహా తెలిపారు. అటు వివిధ పెన్షన్ ఫండ్ మేనేజర్లు, ఇతరత్రా సంస్థాగత ఇన్వెస్టర్లతో రౌండ్‌టేబుల్ కార్యక్రమంలో కూడా మంత్రి పాల్గొన్నారు. ఇంధన రంగం, పర్యావరణహిత ప్రాజెక్టులు, గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సీ మొదలైన వాటిల్లో పెట్టుబడులు, భాగస్వామ్యాలకు ఉన్న అవకాశాలను ఆమె వివరించారు.

**సంస్కరణల దన్ను..**

వచ్చే రెండు దశాబ్దాల పాటు నిలకడగా వృద్ధి సాధించడమనేది సాహసోపేత సంస్కరణలతో పాటు దేశీయంగా సామర్థ్యాలను పెంపొందించుకోవడంపై ఆధారపడి ఉంటుందని నిర్మలా సీతారామన్ చెప్పారు. అంతర్జాతీయంగా మారుతున్న పరిస్థితులను దీటుగా ఎదుర్కొనే విధంగా సంస్థల మధ్య భాగస్వామ్య ఒప్పందాలు ఉండటం కూడా కీలకమని హూవర్ ఇనిస్టిట్యూషన్‌లో కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె తెలిపారు.

గత దశాబ్దకాలంగా ప్రభుత్వం పలు నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టిందని, 20,000 పైగా నిబంధనలను సరళీకరించడంతో పాటు వ్యాపార చట్టాల్లో క్రిమినల్ సెక్షన్లను తగ్గించిందని, ప్రభుత్వ సర్వీసులను డిజిటలీకరించిందని మంత్రి పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేయడంతో పాటు ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంపొందించడం ద్వారా తయారీ రంగ ఆధారిత వృద్ధికి బాటలు వేసినట్లు వివరించారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లయ్యే 2047 నాటికి సంపన్న దేశంగా ఎదగాలని భారత్ నిర్దేశించుకుందని మంత్రి చెప్పారు. ఈ నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను విస్మరించకుండా దీర్ఘకాలిక లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్లాల్సి ఉంటుందని తెలిపారు.

# తొలి ఐపీవో వచ్చేస్తోంది..

**ఐపీవో ద్వారా మహారాష్ట్రలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడులను సమీకరించాలని ఆశిస్తోంది. అంతేకాకుండా రుణ చెల్లింపులకూ నిధులను వెచ్చించనుంది. ఐపీవో ద్వారా దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో గతేడాది ఆగస్ట్‌లో లిస్టయిన ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ తదుపరి రెండో ద్విచక్ర ఈవీ కంపెనీగా ఏథర్ నిలవనుంది. ఓలా ఎలక్ట్రిక్ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 6,145 కోట్లు అందుకున్న విషయం విదితమే.**

**ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కంపెనీ ఏథర్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇష్యూ ఈ నెల 28న ప్రారంభమై 30న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 2,626 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.1 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి కొత్త ఆర్థిక సంవత్సరం(2025–26)లో తొలి పబ్లిక్ ఇష్యూగా నిలవనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 25న షేర్లను ఆఫర్ చేయనుంది.**







**మూన్ బెవరేజెస్ ఐపీవో యోచన**

గ్లోబల్ పానీయాల దిగ్గజం కోక కోలా బాట్లర్ మూన్ బెవరేజెస్ పబ్లిక్ ఇష్యూ యోచనలో ఉంది. దేశీయంగా వేగవంత వృద్ధిలో ఉన్న సాఫ్ట్ డ్రింక్స్ మార్కెట్లో భారీగా విస్తరించే ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ఎంఎంజీ గ్రూప్ కంపెనీ వైస్‌చైర్మన్ అనంత్ అగర్వాల్ తెలియజేశారు. రానున్న మూడు, నాలుగేళ్లలో ఆదాయాన్ని రెట్టింపునకు పెంచుకోవాలని చూస్తున్నట్లు తెలియజేశారు. ఇందుకు వీలుగా ఇప్పటికే రూ. 4,000 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు వెల్లడించారు.


వెరసి కొత్త ప్లాంట్లు, సామర్థ్య విస్తరణ, కొత్త మార్కెట్లలో ప్రవేశం తదితరాలను చేపట్టనున్నట్లు వివరించారు. మరోవైపు పబ్లిక్ ఇష్యూకి వచ్చే యోచనలో సైతం ఉన్నట్లు పేర్కొన్నారు. అస్సామ్‌లోని గువాహటి, ఒడిషాలోని రూర్కెలాలో ఏర్పాటవుతున్న ప్లాంట్లపై మరిన్ని పెట్టుబడులు వెచ్చించేందుకు ప్రణాళికలు వేసినట్లు తెలియజేశారు. దీంతో నిమిషానికి 7,000 బాటిళ్ల సామర్థ్యం జత కలవనున్నట్లు తెలియజేశారు.

ఈక్విటీ జారీ నిధులలో రూ. 1,100 కోట్లు అనుబంధ సంస్థలు తీసుకున్న కొన్ని రుణ చెల్లింపులకు వినియోగించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. 2007లో ఏర్పాటైన కంపెనీ దేశీయంగా పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులలో కార్యకలాపాలు కలిగి ఉంది. వీటి అభివృద్ధి, నిర్మాణం, నిర్వహణ తదితరాలను చేపడుతోంది. 2023-24లో కంపెనీ ఆదాయం 33 శాతం ఎగసి రూ. 1,294 కోట్లను తాకింది.

**ఐపీవోకు కాంటినుమ్ గ్రీన్**

క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా కాంటినుమ్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి అనుమతించింది. ప్రాస్పెక్టస్ ప్రకారం కంపెనీ ఐపీవోలో భాగంగా రూ. 1,250 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్ సంస్థ కాంటినుమ్ గ్రీన్ ఎనర్జీ హోల్డింగ్స్ రూ. 2,400 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనుంది. వెరసి కంపెనీ లిస్టింగ్ ద్వారా రూ. 3,650 కోట్లు సమీకరించనుంది. 2024 డిసెంబర్‌లో కంపెనీ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది.

# పహల్గాంలోనే నా పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకున్నా



**హీరో విజయ్ దేవరకొండ పహల్గాంతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తన పుట్టిన రోజును అక్కడే చేసుకున్నట్లు తెలిపారు.**

జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో పర్యటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి లో 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. పహల్గాంలో మంగళవారం ప్రకృతి అందాలను చూస్తోన్న పర్యటకులపై ఉగ్రవాదులు ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. ఈ దాడిని సినీ సెలబ్రిటీలు ఖండిస్తున్నారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన ఆ ప్రాంతంతో తన అనుబంధాన్ని హీరో విజయ్ దేవరకొండ తాజాగా గుర్తుచేసుకున్నారు. ఈ దాడి ఘటన తన మనసును కలిచివేస్తోందంటూ పోస్ట్ పెట్టారు.

"రెండేళ్ల క్రితమే నా పుట్టినరోజును పహల్గాంలో సెలబ్రేట్ చేసుకున్నాను. ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా అక్కడికి వెళ్లిన నేను.. కశ్మీర్‌లోని అందమైన ప్రాంతంలో అక్కడి ప్రజల స్వచ్ఛమైన నవ్వుల మధ్య నా పుట్టినరోజు చేసుకున్నాను. స్థానికంగా ఉండే కశ్మీరీ స్నేహితులు నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. నిన్న ఆ ప్రాంతంలో జరిగినది విని నా హృదయం పగిలిపోయింది. ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం సిగ్గుచేటు. ఇలాంటి పిరికి వాళ్లను త్వరలోనే అంతమొందిస్తారని ఆశిస్తున్నా. భారతదేశం ఉగ్రవాదానికి ఎప్పటికీ తలవంచదు. బాధిత కుటుంబాలకు మేం అండగా నిలుస్తాం" అని విజయ్ దేవరకొండ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

**ఉగ్రదాడి.. త్రుటిలో తప్పించుకున్న సెలబ్రిటీ జంట**

పహల్గాం లో మంగళవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ సినీ ప్రముఖులు పోస్ట్‌లు పెడుతున్నారు. ఇది క్షమించరాని క్రూరమైన చర్య అని చిరంజీవి అన్నారు. బాధితులను చూస్తుంటే తన హృదయం బరువెక్కుతోందని ఎన్టీఆర్ తెలిపారు. ఇలాంటి అనాగరిక చర్యల వల్ల వచ్చే కోపాన్ని అణచివేయలేకపోతున్నానంటూ జాన్వీకపూర్ ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు తన సానుభూతి తెలియజేస్తూ అల్లు అర్జున్ పోస్ట్ పెట్టారు.




# ఓల్డేజ్ లవ్ స్టోరీ.. ఏడాది తర్వాత ఓటీటీలో తెలుగు వెర్షన్

**ఓటీటీలో మలయాళ సినిమాలకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అయితే వాటి ఒరిజినల్ వెర్షన్స్ కొందరు చూస్తుంటారు. కానీ చాలామంది తెలుగు ఆడియెన్స్ మాత్రం తెలుగులో డబ్ చేస్తే చూద్దామని ఎదురుచూస్తుంటారు. ఇప్పుడు వాళ్ల కోసమా అన్నట్లు ఓ క్యూట్ లవ్ స్టోరీ మూవీ వచ్చేసింది.**

గతేడాది మార్చిలో మలయాళంలో రిలీజైన సినిమా 'జననం 1947 ప్రణయం తుడరున్'. 70 ఏళ్ల వయసున్న ఓ మహిళ, పురుషుడు ప్రేమలో పడితే అనే స్టోరీతో ఈ మూవీ తీశారు. దీన్ని దాదాపు ఏడాది గ్యాప్ తర్వాత తెలుగులో ఇప్పుడు రిలీజ్ చేశారు. ఒరిజినల్ అమెజాన్ ప్రైమ్ లో ఉండగా.. ప్రస్తుతం ఆహాలో తెలుగు వెర్షన్ స్ట్రీమింగ్ అవుతోంది.

'1947 ప్రణయం' పేరుతో దీన్ని తెలుగులో రిలీజ్ చేశారు. సినిమా విషయానికొస్తే.. శివ(జయరాజ్ కొజికోడ్) ఓ వృద్ధాశ్రమంలో పనిచేస్తుంటాడు. అక్కడే ఉంటున్న గౌరీ అనే రిటైర్డ్ టీచర్.. శివని చూసి ఇష్టపడుతుంది. అతడితో కలిసి ఉండాలనుకుంటుంది. దీనికి అనుమతి దక్కడంతో ఇద్దరూ కలిసి ఒకే ఇంట్లో జీవిస్తారు. మరి ఓల్డేజ్ ప్రేమకథ చివరకు ఏమైంది? అనేదే మిగతా స్టోరీ.
ఫీల్ గుడ్ లవ్ స్టోరీ సినిమా చూద్దామనుకుంటే మాత్రం ఈ వీకెండ్ కి ఇది మంచి ఆప్షన్ కావొచ్చు. మరోవైపు ఈ వారం థియేటర్లలో సారంగపాణి జాతకం, చౌర్యపాఠం, జింఖానా సినిమాలు వస్తున్నాయి. మరోవైపు ఓటీటీలో ఎల్ 2 ఎంపురాన్, వీరధీరసూర చిత్రాలు ఉన్నంతలో ఆసక్తి కలిగిస్తున్నాయి.



# నాజర్ హారర్ థ్రిల్లర్ తెలుగులో స్ట్రీమింగ్‌కు రెడీ

**నాజర్ నటించిన హారర్ థ్రిల్లర్ సినిమా త్వరలోనే తెలుగులోనూ స్ట్రీమింగ్ కానుంది. ఎప్పటి నుంచి అంటే?**

ఓటీటీ 'ఆహా' లో ఇప్పటి వరకూ తమిళ్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'ది అకాలీ'ఇకపై తెలుగులోనూ థ్రిల్ చేయనుంది. అదే ఓటీటీ ఈ నెల 26 నుంచి తెలుగు ఆడియో అందుబాటులో ఉండనుంది. నాజర్, వినోద్ కిషన్, తలైవాసల్ విజయ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు మహ్మద్ అసిఫ్ హమీద్ తెరకెక్కించిన హారర్ థ్రిల్ మూవీ ఇది. గతేడాది థియేటర్లలో విడుదలైంది.

**మరో ఓటీటీలోకి 'మసూద'.. ఎక్కడంటే!**

జానిస్ అనే అమ్మాయి వరుస హత్యలు చేస్తుంటుంది. సంబంధిత కేసును ఛేదించే క్రమంలో పోలీసు అధికారికి విస్తుపోయే విషయాలు తెలుస్తాయి. మరి, జానిస్ ఎందుకు మర్డర్స్ చేయాల్సి వచ్చింది? ఆమె వెనుక ఎవరైనా ఉన్నారా? తదితర ఆసక్తికర అంశాలతో ఈ చిత్రం రూపొందింది.

# ప్రవస్తి ఎవరు? ఈ గొడవంతా అసలెందుకు?

**'పాడుతా తీయగా'ప్రోగ్రాంకి క్లీన్ ఇమేజ్ ఉంది. కానీ ప్రవస్తి ఆరాధ్యఅనే సింగర్ చేసిన ఆరోపణల కారణంగా మాయని మచ్చ ఏర్పడింది. జడ్జిలైన కీరవాణి, చంద్రబోస్, సునీత తనని అన్యాయంగా టార్గెట్ చేసి ఎలిమినేట్ చేశారని ఈమె ఆరోపిస్తుంది. ఒకరిపై ఒకరు వీడియోలు చేసుకుంటూ వివరణలు ఇచ్చుకుంటారు. సరే ఇదంతా పక్కనబెడితే ఇంతకీ ప్రవస్తి ఆరాధ్య ఎవరు? ఆమె బ్యాక్ గ్రౌండ్ ఏంటి?**

**ప్రవస్తి బ్యాక్ గ్రౌండ్**

పూర్తి పేరు ప్రవస్తి ఆరాధ్య. తెలుగమ్మాయే. ముద్దుగా రైనో అని కూడా పిలుస్తుంటారు. 2006 డిసెంబరు 9న పుట్టింది. అంటే ప్రస్తుతం ఈమె వయసు 19 ఏళ్లు. 2011లో ఐదేళ్లకే పాడటం మొదలుపెట్టింది. సరిగమప లిటిల్ ఛాంప్స్ అనే పోటీలో పాల్గొని విజేతగానూ నిలిచింది.

తెలుగుతో పాటు తమిళ సింగింగ్ రియాలిటీ షోల్లో పాల్గొని ప్రవస్తి గుర్తింపు తెచ్చుకుంది. 2014లో సూపర్ సింగర్ జూనియర్ 4 తమిళ షోలో పాల్గొని ఫైనల్స్ వరకు వచ్చింది. ఇక గతేడాది తెలుగులో సూపర్ సింగర్ పాటల పోటీలో పాల్గొని విజేతగా నిలిచింది.



ఇప్పుడే కాదు చిన్నతంలోనూ 'పాడుతా తీయగా' ప్రోగ్రాంలో పాల్గొంది. అప్పటి జడ్జిలైన ఎస్.జానకి, ఎస్పీ బాలసుబ్రమణ్యం నుంచి ప్రశంసలు అందుకుంది. వీళ్లిద్దరి ప్రోత్సాహం వల్లే సంగీత రంగంలో రాణించాలనుకుంది. కానీ తాజాగా పాడుతా తీయగా సిల్వర్ జూబ్లీ షో నుంచి ప్రారంభంలోనే ఎలిమినేట్ అయిపోయింది.

తను బాగానే పెర్ఫార్మ్ చేసినప్పటికీ జడ్జిలు కీరవాణి, సునీత, చంద్రబోస్ తనపై వివక్ష చూపించారని, టార్గెట్ చేశారని సంచలన వీడియో రిలీజ్ చేసింది. తన ఇకపై గాయనిగా కొనసాగాలనుకోవట్లేదని కూడా కుండబద్ధలు కొట్టేసింది. మరి నిజంగా ఈ మాటపై నిలబడుతుందా? అసలు ఈ గొడవకు ఫుల్ స్టాప్ ఎప్పుడు పడుతుందనేది చూడాలి?

# మలయాళ కామెడీ మూవీ.. ఓటీటీలో తెలుగులోనూ




**ఓటీటీలోకి ఎప్పటికప్పుడు కొత్త సినిమాలు వస్తూనే ఉంటాయి. మరీ ముఖ్యంగా మలయాళ చిత్రాల్ని డబ్ చేసి నేరుగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేస్తుంటారు. అలా దాదాపు రెండున్నర నెలల తర్వాత ఓటీటీలో కామెడీ మూవీ స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.**

'ప్రేమలు' అనే డబ్బింగ్ సినిమాతో మనకు పరిచయమైన సంగీత్ ప్రతాప్, మాథ్యూ థామస్, శ్యామ్ మోహన్ తో పాటు అర్జున్ అశోకన్, మహిమ నంబియార్ ప్రధాన పాత్రల్లో నటించిన మూవీ 'బ్రొమాన్స్'. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. ఫిబ్రవరి 14న రిలీజై హిట్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా దాదాపు రెండున్నర నెలల తర్వాత అంటే మే 1 నుంచి సోనీ లివ్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో అందుబాటులోకి రానుంది.
'బ్రొమాన్స్' విషయానికొస్తే.. బింటో (మాథ్యూ థామస్) తల్లిదండ్రులతో కలిసి నివసిస్తుంటాడు. ఇతడి అన్నయ్య షింటో (శ్యామ్) కొచ్చిలో జాబ్ చేస్తూ అక్కడే ఉంటాడు. న్యూఇయర్ సెలబ్రేషన్స్ కోస బింటో.. కూర్గ్ వెళ్లగా.. అన్నయ్య కనిపించకుండా పోయాడనే విషయం తెలుస్తుంది.దీంతో అన్నయ్యని వెతికేందుకు బింటో ప్రయత్నిస్తాడు. ఈ క్రమంలో ఇతడికి షబీర్, ఐశ్వర్య, హరిహరసుధాన్, కొరియర్ బాబు అని నలుగురు వ్యక్తులు కలుస్తారు. వీళ్లందరూ కలిసి షింటోని వెతికుతుంటారు. మరి చివరకు షింటో దొరికాడా? ఏమైందనేదే మిగతా స్టోరీ.

# నా అనుమతి లేకుండా 'ఎమర్జెన్సీ' ప్రచారంలో నా పేరు వాడారు

**బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. ఈ సినిమా మరోసారి ఇబ్బందులను ఎదుర్కొంటోంది. నిర్మాణ సంస్థ మణికర్ణిక ఫిల్మ్స్, ప్రముఖ ప్రసార సంస్థ నెట్‌ఫ్లిక్స్‌పై ఒప్పంద ఉల్లంఘన, పరువు నష్టం దావా వేశారు సీనియర్ జర్నలిస్టు, రచయిత కూమి కపూర్.**

బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. ఈ సినిమా మరోసారి ఇబ్బందులను ఎదుర్కొంటోంది. నిర్మాణ సంస్థ మణికర్ణిక ఫిల్మ్స్, ప్రముఖ ప్రసార సంస్థ నెట్‌ఫ్లిక్స్‌పై ఒప్పంద ఉల్లంఘన, పరువు నష్టం దావా వేశారు సీనియర్ జర్నలిస్టు, రచయిత కూమి కపూర్. ఆమె రచించిన 'ఎమర్జెన్సీ: ఎ పర్సనల్ హిస్టరీ' అనే పుస్తకం ఆధారంగానే ఈ సినిమా రూపొందించడానికి ఒప్పందం జరిగింది. కానీ ఉద్దేశపూర్వకంగానే తన అనుమతి లేకుండా తన పేరును, తన పుస్తకాన్ని ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఉపయోగించుకున్నారని ఆమె ఆరోపించారు. ఈ సినిమాలో తప్పులు ఉన్నాయి వాటిని నెట్‌ఫ్లిక్స్ వెర్షన్ నుంచి తొలగించాలని చెప్పినప్పటికీ వారు ఆ సన్నివేశాలను తొలగించలేదని ఆమె పేర్కొన్నారు.

"ఈ పుస్తక హక్కులను కొనుగోలు చేసేటప్పుడు ఒప్పందం కుదుర్చుకున్నాం. అందులో రచయిత అనుమతి లేకుండా ప్రచారం కోసం ఆమె పేరు, పుస్తకాన్ని ఉపయోగించకూడదని పేర్కొన్నాం. ఆ సమయంలో నేను గోవాలో ఉన్నాను. స్క్రిప్ట్‌ను చూడలేకపోయాను. వాళ్లు ఆ ఒప్పందాన్ని గౌరవిస్తారు అనుకున్నా. కానీ వాళ్లు ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించారు. ఈ సినిమా 'ఎమర్జెన్సీ: ఎ పర్సనల్ హిస్టరీ' అనే పుస్తకం ఆధారంగా రూపొందిందని ప్రచారం చేశారు. ఆ తర్వాత వారికి లీగల్ నోటీసులు పంపించాను. కానీ వారి దగ్గర నుంచి ఎలాంటి సమాధానం లేదు" అని అన్నారు. అందుకే నిర్మాతలు, నెట్‌ఫ్లిక్స్ సంస్థపై చర్యలు తీసుకోవాలని కోర్టును ఆశ్రయించానని ఆమె పేర్కొన్నారు.



# ఎస్ఆర్‌హెచ్‌ను చిత్తు చేసిన ముంబై..

**ఐపీఎల్-2025లో ముంబై ఇండియన్స్ వరుస విజయాలతో దూసుకుపోతుంది. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ముంబై విజయ భేరి మోగించింది. 144 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 15.4 ఓవర్లలోనే చేధించింది.**

ముంబై బ్యాటర్లలో రోహిత్ శర్మ(46 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 70) అద్భుత ఇన్నింగ్స్ ఆడగా.. సూర్యకుమార్ యాదవ్(19 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 40 నాటౌట్) మెరుపు మెరిపించాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో ఉనద్కట్, మలింగ, అన్సారీ తలా వికెట్ సాధించారు.

**ముంబై రెండో వికెట్ డౌన్..**
రోహిత్ శర్మ రూపంలో ముంబై ఇండియన్స్ రెండో వికెట్ కోల్పోయింది. 70 పరుగులు చేసిన రోహిత్.. మలింగ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ముంబై విజయానికి 32 బంతుల్లో 14 పరుగులు కావాలి. క్రీజులో సూర్యకుమార్ యాదవ్(26) ఉన్నాడు.

**రోహిత్ శర్మ హాఫ్ సెంచరీ..**
రోహిత్ శర్మ వరుసగా రెండో హాఫ్ సెంచరీ సాధించాడు. ఎస్ఆర్‌హెచ్‌తో మ్యాచ్‌లో రోహిత్(52) తన బ్యాటింగ్‌ను కొనసాగిస్తున్నాడు. 11 ఓవర్లు ముగిసే సరికి ముంబై ఇండియన్స్ రెండు వికెట్ల నష్టానికి 85 పరుగులు చేసింది.

**దూకుడుగా ఆడుతున్న రోహిత్..**
4 ఓవర్లు ముగిసే సరికి ముంబై ఇండియన్స్ వికెట్ నష్టానికి 43 పరుగులు చేసింది. క్రీజులో రోహిత్ శర్మ(25), విల్ జాక్స్(7) ఉన్నారు.

**ముంబై ఇండియన్స్ తొలి వికెట్ డౌన్..**
144 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ తొలి వికెట్ కోల్పోయింది. 11 పరుగులు చేసిన ర్యాన్ రికెల్టన్.. జయదేవ్ ఉనద్కట్ బౌలింగ్‌లో ఔటయ్యాడు.

**చెలరేగిన క్లాసెన్.. ముంబై టార్గెట్ ఎంతంటే?**
టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 13 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన ఎస్ఆర్‌హెచ్‌ను క్లాసెన్ విరోచిత పోరాటంతో ఆదుకున్నాడు. కేవలం 44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 71 పరుగులు చేశాడు.

అతడితో పాటు ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అభినవ్ మనోహర్ కీలక నాక్ ఆడాడు. 37 బంతుల్లో 2 ఫోర్లు, మూడు సిక్సర్లతో 43 పరుగులు చేశాడు. వీరిద్దరూ



**క్లాసెన్ విరోచిత ఇన్నింగ్స్ వృధా..**
**సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 13 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన ఎస్ఆర్‌హెచ్‌ను క్లాసెన్ విరోచిత పోరాటంతో ఆదుకున్నాడు. కేవలం 44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 71 పరుగులు చేశాడు.**

**అతడితో పాటు ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అభినవ్ మనోహర్ కీలక నాక్ ఆడాడు. 37 బంతుల్లో 2 ఫోర్లు, మూడు సిక్సర్లతో 43 పరుగులు చేశాడు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ముంబై బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. చాహర్ రెండు, బుమ్రా, హార్దిక్ తలా వికెట్ సాధించారు.**

**ఐపీఎల్-2025లో ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్ ఘన విజయం సాధించింది. 144 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 15.4 ఓవర్లలోనే చేధించింది. ముంబై బ్యాటర్లలో రోహిత్ శర్మ(46 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 70) అద్భుత ఇన్నింగ్స్ ఆడగా.. సూర్యకుమార్ యాదవ్(19 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 40 నాటౌట్) మెరుపు మెరిపించాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో ఉనద్కట్, మలింగ, అన్సారీ తలా వికెట్ సాధించారు.**



ఆరో వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ముంబై బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. చాహర్ రెండు, బుమ్రా, హార్దిక్ తలా వికెట్ సాధించారు.

**హెన్రిచ్ క్లాసెన్ ఫిఫ్టీ..**
హెన్రిచ్ క్లాసెన్ 34 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. తన ఫైటింగ్ నాక్‌తో ఎస్ఆర్‌హెచ్ స్కోర్ బోర్డును ముందుకు తీసుకువెళ్తున్నాడు. 15 ఓవర్లు ముగిసే సరికి సన్‌రైజర్స్ 5 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది.

**దూకుడు పెంచిన క్లాసెన్..**
10 ఓవర్లు ముగిసే సరికి ఎస్ఆర్‌హెచ్ 5 వికెట్ల నష్టానికి 51 పరుగులు చేసింది. క్రీజులో హెన్రిచ్ క్లాసెన్(25), మనోహర్(1) ఉన్నారు.

**ఎస్ఆర్‌హెచ్‌కు భారీ షాక్..**
**టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్‌హెచ్‌కు భారీ షాక్ తగిలింది. ట్రావిస్ హెడ్(0) రూపంలో సన్‌రైజర్స్ తొలి వికెట్ కోల్పోయింది. ట్రెంట్ బౌలింగ్‌లో హెడ్ పెవిలియన్‌కు చేరాడు. 2 ఓవర్లు ముగిసే సరికి హైదరాబాద్ వికెట్ నష్టానికి 9 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌కు ముందు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా సన్‌రైజర్స్, ముంబై ఇండియన్స్ ఆటగాళ్లు ఓ నిమిషం మౌనం పాటించారు.**
**ఐపీఎల్-2025లో ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. పహల్గామ్ ఉగ్రదాడి ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా ఇరు జట్ల ఆటగాళ్లు, మ్యాచ్ అఫీషియల్స్ నల్లటి బ్యాండ్లు ధరించి బరిలోకి దిగారు. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు చెరో మార్పుతో బరిలోకి దిగాయి. పేసర్ అశ్వినీ కుమార్ స్థానంలో విఘ్నేష్ పుత్తర్ తుది జట్టులోకి వచ్చాడు. అదేవిధంగా స్టార్ పేసర్ మహ్మద్ షమీని ఎస్ఆర్‌హెచ్ పక్కన పెట్టింది. అతడి స్థానంలో జయదేవ్ ఉనద్కట్ జట్టులోకి వచ్చాడు.**

**పీకల్లోతు కష్టాల్లో ఎస్ఆర్‌హెచ్.. 13 పరుగులకే 4 వికెట్లు**
ఉప్పల్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు దారుణ ప్రదర్శన కనబరుస్తున్నారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్‌హెచ్ కేవలం 13 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ట్రావిస్ హెడ్(0), కిషన్(1), అభిషేక్ శర్మ(8), నితీష్ రెడ్డి(2) వరుస క్రమంలో పెవిలియన్‌కు చేరారు. ముంబై బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్ తలా రెండు వికెట్లు సాధించారు.

**తుది జట్లు**
సన్‌రైజర్స్ హైదరాబాద్ (ప్లేయింగ్ XI): అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, నితీష్‌కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్(వికెట్ కీపర్), అనికేత్ వర్మ, పాట్ కమిన్స్(కెప్టెన్), హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కత్, జీషన్ అన్సారీ, ఎషాన్ మలింగ

ముంబై ఇండియన్స్ (ప్లేయింగ్ XI): ర్యాన్ రికెల్టన్(వికెట్ కీపర్), విల్ జాక్స్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా(కెప్టెన్), నమన్ ధీర్, మిచెల్ సాంట్నర్, దీపక్ చాహర్, ట్రెంట్ బౌల్ట్, జస్ప్రీత్ బుమ్రా, విఘ్నేష్ పుత్తూర్.




## జస్ప్రీత్ బుమ్రా 'ట్రిపుల్ సెంచరీ'..

**టీమిండియా పేస్ గుర్రం, ముంబై ఇండియన్స్ స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా టీ20ల్లో 300 వికెట్ల మైలు రాయిని అందుకున్నాడు. ఐపీఎల్-2025లో ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో హెన్రిచ్ క్లాసెన్ వికెట్‌తో బుమ్రా ఈ ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఫీట్ సాధించిన రెండో ఇండియన్ ఫాస్ట్ బౌలర్‌గా బుమ్రా నిలిచాడు.**

ఈ జాబితాలో బుమ్రా కంటే ముందు టీమిండియా వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్(318) ఉన్నాడు. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన ఐదో భారత బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. అదేవిధంగా మరో ఘనతను బుమ్రా ఈ మ్యాచ్‌లో సాధించాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరపున అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలింగ్ దిగ్గజం లసిత్ మలింగ(170) రికార్డును బుమ్రా సమం చేశాడు.

మరో వికెట్ పడగొడితే మలింగను జస్ప్రీత్ అధిగమిస్తాడు. అయితే ఈ మ్యాచ్‌లో బుమ్రా చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. తన నాలుగు ఓవర్ల కోటాలో ఏకంగా 39 పరుగులిచ్చి ఓ వికెట్ పడగొట్టాడు.

**భారత్ తరపున అత్యధిక టీ20 వికెట్లు తీసిన బౌలర్లు వీరే**
యుజ్వేంద్ర చాహల్ 373
పీయూష్ చావ్లా 319
భువనేశ్వర్ కుమార్ 318
రవిచంద్రన్ అశ్విన్ 315
జస్ప్రీత్ బుమ్రా 300

## ఇషాన్ కిషన్.. నీకు కొంచమైనా తెలివి ఉందా? వీడియో వైరల్

**ఐపీఎల్-2025లో ఉప్పల్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఔటైన విధానం తీవ్ర చర్చనీయాంశమైంది. అంపైర్ ఔట్ ఇవ్వకపోయినా కిషన్ మాత్రం తనంతట తానే మైదానాన్ని వీడేందుకు సిద్ధం కావడం అందరని షాక్‌కు గురిచేసింది.**

**అసలేమి జరిగిందంటే?**
ట్రావిస్ హెడ్ ఔటయ్యాక క్రీజులోకి ఇషాన్ కిషన్ బ్యాటింగ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో 3వ ఓవర్ వేసిన దీపక్ చాహర్ తొలి బంతిని కిషన్‌కు లెగ్ సైడ్ వైపునకు సంధించాడు. ఆ బంతిని డౌన్ ది లెగ్ ఆడటానికి ఇషాన్ ప్రయత్నించాడు. కానీ బంతి కిషన్ బ్యాట్ మిస్స్ అయ్యి వికెట్ కీపర్ రికెల్టన్ చేతికి వెళ్లింది.

వెంటనే కిషన్ మాత్రం ఔట్ అని భావించి పెవిలియన్‌కు వైపు నడిచాడు. అప్పటికి బౌలర్, వికెట్ కీపర్ కనీసం అప్పీల్ కూడా చేయలేదు. ఎప్పుడైతే కిషన్ వెళ్లిపోవడం చూసి అంపైర్ ఔట్ అని వేలు పైకెత్తాడు. కిషన్ ఏదో క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి వెళ్లిపోయాడని అంతా అనుకున్నారు. కానీ ఇక్కడే అసలు ట్విస్ట్ చోటు చేసుకుంది.



రిప్లేలో బంతి కనీసం బ్యాట్ కి గాని గ్లౌస్‌కి, బాడీ కి గానీ తగిలిన ఆనవాళ్లు రిప్లేలో కన్పించలేదు. అతడు ఔటైన తర్వాత ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. దీంతో కిషన్‌పై ఎస్ఆర్‌హెచ్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా విమర్శల వర్షం కురిపిస్తున్నారు. కొంచెం అయినా తెలివి ఉందా అంటూ పోస్టులు చేస్తున్నారు. మరి కొంత మంది మ్యాచ్ ఫిక్సింగ్ అంటూ కామెంట్లు చేస్తున్నారు.



## ఫిడే మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నీ విజేతగా కోనేరు హంపి

**ఫిడే మహిళల గ్రాండ్ ప్రి చెస్ టోర్నీ విజేతగా కోనేరు హంపి నిలిచింది.**

తెలుగు తేజం, గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఫిడే మహిళల గ్రాండ్ ప్రి చెస్ టోర్నీ విజేతగా నిలిచింది. పుణె వేదికగా నిర్వహించిన ఈ చెస్ టోర్నీలో తుదిపోరు సమయానికి జు జినర్ (చైనా)తో కలిసి ఆమె అగ్రస్థానంలో కొనసాగింది. ఫైనల్ రౌండ్‌లో కోనేరు హంపి బల్గేరియాకు చెందిన నుర్గుయిల్ సలిమోవాపై 10 తేడాతో విజయం సాధించింది. మరోవైపు, జు జినర్ సైతం రష్యాకు చెందిన పొలినా షువలోవాపై గెలుపొందింది. దీంతో ఇద్దరూ మొదటి స్థానంతో ముగించినట్లయ్యింది. అయితే.. అత్యుత్తమ టైబ్రేక్ ఆధారంగా హంపి టైటిల్ విజేతగా నిలిచింది. మరో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక.. ముంగంతూల్ బత్ఖుయాగ్ (మంగోలియా)తో; వైశాలి.. సలోమ్ మెలియా (జార్జియా)తో; దివ్య దేశ్‌ముఖ్.. ఎలీనా కష్లిన్స్కాయా (రష్యా)తో తమ గేమ్‌లను డ్రాగా ముగించారు

## ఇంట కూలబడుతున్నారు.. బయట కొడుతున్నారు.. బెంగళూరు ఆటే వేరయా!

**ఈ సీజన్‌లో బెంగళూరు ఆటతీరు చూస్తుంటే విచిత్రంగా అనిపిస్తోంది. ఇంట ఓడిపోతూ.. బయట గెలుస్తూ ప్లేఆఫ్స్ రేసులో పరుగులు తీస్తోంది.**

ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బరిలో దిగిన ప్రతిసారీ అభిమానుల్లో అంచనాలు తారస్థాయిలో ఉంటాయి. ఆ జట్టు ఇప్పటివరకు ఒక్క కప్పు కూడా కొట్టకపోయినా అభిమానుల మద్దతు ఈ సీజన్‌కూ పెరిగిందే తప్పా తగ్గలేదు. ఐపీఎల్ 18వ ఎడిషన్‌లోనూ ఆర్సీబీకి అభిమానులు అదేస్థాయిలో తమ మద్దతు తెలియజేస్తున్నారు. కానీ చిత్రంగా ఆ జట్టు సొంతగడ్డపై సత్తా చాటలేకపోతోంది. ఇప్పటివరకు చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ బెంగళూరు ఓడిపోయింది. మరోవైపు బయట మైదానాల్లోకి వెళ్లి ఏకంగా అయిదు మ్యాచ్‌ల్లో గెలిచింది ఆర్సీబీ. ఇంట గెలిచి రచ్చ గెలవడం కాకుండా.. రచ్చే గెలుస్తున్నారు బెంగళూరు వాళ్లు. ఈ సీజన్‌లో మరి ఏ జట్టూ ఇలా బయట మైదానాల్లో ఇన్ని మ్యాచ్‌లు గెలవలేదు.

**ఆ బలం ఎక్కడిది?**
సొంతగడ్డపై బాగా ఆడడం.. వేరే మైదానానికి వెళ్లి ఎక్కువ మ్యాచ్‌ల్లో ఓడిపోవడం బెంగళూరు కి ప్రతి సీజన్లో అలవాటే. కానీ ఈసారి ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. వేరే గడ్డపై రెట్టించిన ఉత్సాహంతో ఆడుతూ ప్రత్యర్థి జట్లను కంగుతినిపిస్తోంది. బయట మైదానాల్లో కలసికట్టుగా ఆడడం.. అటాకింగ్ దృక్పథం బెంగళూరుకి కలిసొస్తుంది. కోల్‌కతా, చెన్నై, పంజాబ్ తదితర మ్యాచ్‌ల్లో ఇదే సూత్రాన్ని ఆ జట్టు అమలుచేసింది. బ్యాటర్లు దూకుడుగా ఆడుతూ ప్రత్యర్థి బౌలింగ్‌ను కకావికలం చేస్తే.. బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో ప్రత్యర్థి బ్యాటర్లకు కళ్లెం వేశారు.




### ఆ బ్యాటింగ్ లైనప్

ఈసారి బెంగళూరుకి మంచి బ్యాటింగ్ లైనప్ కుదిరింది. కోహ్లి, ఫిల్ సాల్ట్ కాకుండా కెప్టెన్ రజత్ పాటీదార్, దేవ్‌దత్ పడిక్కల్, లివింగ్‌స్టన్, జితేశ్‌శర్మ, టిమ్ డేవిడ్ లాంటి మ్యాచ్ విన్నర్లు జట్టులో ఉన్నారు. అయితే చిత్రంగా వీళ్లు సొంతగడ్డపై కాకుండా బెంగళూరు ఆవలే మంచి ప్రదర్శన చేస్తున్నారు. అందుకే ఆర్సీబీ బయట మైదానాల్లో 5 విజయాలు అందుకోగలిగింది. కోహ్లి, సాల్ట్, పడిక్కల్, రజత్ పాటీదార్ స్థిరంగా ఆడడం కూడా ఆ జట్టుకు కలిసొస్తుంది. చిన్నస్వామి స్టేడియంలో కనీసం ఒక విజయమైనా సాధించేదే కానీ.. ఎప్పటిలాగే బెంగళూరుని దురదృష్టం వెంటాడింది. చేజేతులా ఒక మ్యాచ్‌ను పోగొట్టుకుంది. ఇప్పటివరకు ఆర్సీబీ చిన్నస్వామి స్టేడియంలో మూడు మ్యాచ్‌లు ఆడి అన్నింట్లోనూ ఓడింది. నిజానికి సొంతగడ్డపై ఓడడం అభిమానులకు బాధగానే ఉన్నా.. బయట మైదానాల్లో సత్తా చాటి పాయింట్ల పట్టికలో టాప్3లో నిలవడం వారికి సంతోషాన్ని ఇస్తోంది. ఇక రాబోయే మ్యాచ్‌ల్లో బెంగళూరు ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తుందా లేక సొంతగడ్డపై తొలి విజయాన్ని రుచి చూస్తుందా అనేది ఆసక్తికరం.

**ఒకప్పుడు బయట మైదానాల్లో ఆర్సీబీ ఒత్తిడికి తట్టుకోలేక ప్రత్యర్థికి దాసోహమనేది. ఇప్పుడు ఆ జట్టు ఆట మారింది. సొంతగడ్డ ఆవల భయం లేకుండా ఆడుతోంది. కోహ్లి, సాల్ట్ ఆ జట్టు విజయాల్లో కీలకమవుతున్నారు. ఆరంభంలోనే వీరిలో ఒకరు విజయవంతం కావడంతో ఆర్సీబీకి శుభారంభం లభిస్తోంది. మిగిలిన బ్యాటర్లు ఆ ఆరంభాలను కొనసాగించి జట్టుకు మంచి స్కోర్లు అందిస్తున్నారు. ఛేదనలో అయితే విజయం దిశగా తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా కృనాల్ పాండ్య, సుయాశ్ శర్మ రూపంలో ఆ జట్టుకు మంచి స్పిన్నర్లు దొరికారు. వీళ్లిద్దరూ పొదుపుగా బంతులు వేయడంతో పాటు కీలక సమయాల్లో బ్రేక్‌లు అందిస్తూ మ్యాచ్‌లను మలుపు తిప్పుతున్నారు. భారీ స్కోర్లు నమోదైన ముంబయితో మ్యాచ్‌లో అయితే కృనాల్ ఒంటిచేత్తో బెంగళూరుని గెలిపించాడు. చివరి ఓవర్లో అతడు 3 వికెట్లు పడగొట్టి ముంబయికి పరాజయాన్ని రుచి చూపించాడు. 10 ఏళ్ల విరామం తర్వాత వాంఖడే మైదానంలో ఆర్సీబీ విజయాన్ని అందుకుంది.**

ముఖ్యంగా చెపాక్ స్టేడియంలో సుదీర్ఘకాలం గెలవలేకపోయిన ఆర్సీబీ విజయాన్ని రుచి చూసింది. ఏకంగా 17 ఏళ్ల తర్వాత చెపాక్ కోటను బద్దలు కొట్టింది. రజత్ పాటీదార్, హేజిల్‌వుడ్, లివింగ్‌స్టన్ ఆ జట్టు విజయానికి బాటలు వేశారు.